www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
14 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 219

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## తప్పు చేస్తే రేవంత్‌ని కూడా ప్రశ్నిస్తా?



- రవీంద్రభారతిలో ఏపూరి సోమన్న పుస్తకావిష్కరణ
- సొంత పార్టీ నేతలపై రాజగోపాల్ రెడ్డి ఫైర్
- తప్పు చేస్తే రేవంత్ ప్రభుత్వాన్నిప్రశ్నిస్తా
- సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారన్న స్పష్టత
- వసూల్ రాజాలను తరిమికొట్టాలని పిలుపు
- ప్రజాస్వామ్యంలో పేదల కష్టాలపై ఆవేదన

03




## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సర్ ఎసరు..?

- 'సర్'తో రాష్ట్రంలో 73.38 లక్షల ఓట్లు గల్లంతు, గ్రేటర్‌లో 43 లక్షలు
- రివ్యూలు చేసినా తగ్గని ఓట్ల తొలగింపుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ టెన్షన్
- ఓల్డ్ సిటీలో భారీగా ఓట్లు కోల్పోతున్నామనే ఆందోళనలో మజ్లిస్
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బోగస్ ఓట్ల తొలగింపు తమకు మేలు చేస్తుందని బీజేపీ ధీమా
- ముసాయిదా జాబితా విడుదల తర్వాత ఓట్ల రికవరీకి పార్టీల కసరత్తు

03



## అన్ని కేసులకు ఒకే టైమ్ సాధ్యం కాదు

- సాంకేతికతను సహాయక సాధనంగా మాత్రమే వాడాలి
- భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్

07

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి గులాబీ పార్టీ తీవ్ర విమర్శలు చేస్తోంది. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు నిత్యం ఆరోపణలు సంధిస్తున్నారు. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడానికి కేటీఆర్, హరీష్ రావు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రేవంత్ సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిల మీద అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. కొండల్ రెడ్డి వ్యాపారాలు చూసుకుంటుండగా, తిరుపతి రెడ్డి కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలు మోస్తున్నారు. ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని గులాబీ నేతలు గట్టిగా వాదిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన పదవిని అడ్డం పెట్టుకుని కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. వందల కోట్ల విలువైన ఆస్తులను అతి తక్కువ ధరకే కట్టబెడుతున్నారని మండిపడుతున్నారు.




# కాంగ్రెస్ ఫెయిల్!

### రేవంత్ సోదరులను టార్గెట్ చేస్తూ గులాబీ పార్టీ తీవ్ర విమర్శలు
### మంత్రి శ్రీధర్ బాబు మినహా కాంగ్రెస్ సీనియర్లు మౌనం
### టెస్సా రాక్ట్ కంపెనీ భూముల కేటాయింపులపై కేటీఆర్, హరీశ్ ఆరోపణలు
### కొండల్ రెడ్డికి లబ్ధి చేకూరుస్తున్నారంటూ బీఆర్ఎస్ ప్రచారం
### బీఆర్ఎస్ ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టడంలో కాంగ్రెస్ వైఫల్యం
### ఇదే తీరు కొనసాగితే ప్రభుత్వానికి నష్టమని రాజకీయ విశ్లేషణ

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** ఈ రకమైన ప్రచారంతో జనంలో ప్రభుత్వం మీద వ్యతిరేకత పెంచాలని చూస్తున్నారు. ప్రతిపక్షం చేస్తున్న దూకుడు రాజకీయాలతో రాష్ట్రంలో వాతావరణం పూర్తిగా వేడెక్కింది. సామాన్యులను ఆకర్షించేలా సోషల్ మీడియాను వేదికగా మలుచుకుంటున్నారు. తాజాగా టెస్స రాక్ట్ కంపెనీకి భూ కేటాయింపులు జరగడం పెద్ద రాజకీయ దుమారానికి దారితీసింది. అత్యంత విలువైన భూములను ఆ సంస్థకు అప్పనంగా రాసిచ్చారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ కంపెనీ వెనుక కొండల్ రెడ్డి ఉన్నారని, ఇదొక బినామీ సంస్థ అని విమర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే భారీ కుంభకోణానికి తెరలేపారని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సోషల్ మీడియా వేదికగా డాక్యుమెంట్లు విడుదల చేస్తూ రేవంత్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టాలని చూస్తున్నారు. ప్రతిపక్షం చేస్తున్న ఈ దూకుడు ప్రచారంతో

మిగతా 3లో..




## నల్లగొండ వైద్యశాఖలో నయా దందా!

- నల్లగొండ వైద్యశాఖలో రూ. 2 లక్షల డిప్యూటేషన్ వసూళ్లు
- మౌఖిక ఆదేశాలతో 15 మంది సిబ్బంది అక్రమ బదిలీలు
- ఏజెంట్‌గా హెడ్ నర్సుతో నడుస్తున్న అవినీతి తంత
- పలు ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా దందా
- విద్యార్థుల సర్టిఫికెట్లపై సైతం చిల్లర వసూళ్లు
- బాధ్యులైన అధికారులపై విచారణకు డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నల్లగొండ జిల్లా వైద్యారోగ్య శాఖలో జరుగుతున్న అక్రమ దందా ఇప్పుడు ప్రజల మధ్య తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లా స్థాయి అధికారి ఒకరు నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి, కేవలం వసూళ్లే లక్ష్యంగా డిప్యూటేషన్ల వ్యవహారాన్ని నడుపుతున్నారు. ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా, కేవలం మౌఖిక ఆదేశాలతో సిబ్బందిని ఒక చోటు నుండి మరో చోటుకు పంపుతున్నారు. ఈ ప్రక్రియలో ఒక్కో డిప్యూటేషన్ కోసం 2 లక్షల రూపాయల వరకు ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిప్యూటేషన్ ఇవ్వాలంటే స్పష్టమైన ప్రొసీడింగ్స్ ఉండాలి. కానీ ఇక్కడ రూల్స్ అన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. జిల్లాలోని నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ వంటి ప్రాంతీయ

మిగతా 3లో..

## కాంగ్రెస్ నిజమైన సెక్యులర్ పార్టీ

- 'సర్' ప్రక్రియతో 70 లక్షల ఓట్లు తొలగింపు కుట్ర
- గత బీఆర్ఎస్ పాలనలో గ్రూప్-1 పేపర్ల విక్రయం
- కాంగ్రెస్ మాత్రమే నిజమైన సెక్యులర్ పార్టీ
- ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయడం ఎవరివల్ల కాదు
- కాంగ్రెస్ హయాంలో టీజీపీఎస్సీ ప్రక్షాళన

02



## బడి ఎత్తితే ఉద్యోగం ఊడినట్టే!

- ఉపాధ్యాయుల గైర్హాజరుపై తెలంగాణ ప్రభుత్వ కఠిన నిర్ణయం
- అనుమతి లేకుండా ఏడాది గైర్హాజరైతే సర్వీసు నుంచి తొలగింపు
- ఐదేళ్లు దూరంగా ఉంటే రాజీనామా చేసినట్లే పరిగణించే నిబంధన
- చర్యలు తీసుకోని పై అధికారులపై కూడా శాఖాపరమైన వేటు
- ప్రభుత్వ బడుల్లో బోధనా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

02



## అమ్మ లేదని.. అమ్మేశారు!

- జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో కవల పిల్లల అక్రమ విక్రయం
- తండ్రి పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దత్తత ముసుగులో బేరం
- కవల పిల్లలను వేర్వేరు కుటుంబాలకు విడదీసి అప్పగింత
- ఈ అక్రమ ఒప్పందంలో భారీగా చేతులు మారిన డబ్బులు
- తండ్రి, కొనుగోలుదారులు మరియు నోటరీ లాయర్‌పై కేసు నమోదు
- పసికందుల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఠాపై కఠిన చర్యలకు డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో ఇటీవల ఒక హృదయవిదారక ఘటన వెలుగు చూసింది. పుట్టిన కొద్ది రోజులకే తల్లి గంగజల మరణించడంతో కవల పిల్లలను చూసే బాధ్యత పూర్తిగా తండ్రి సాయిలు మీద పడింది. ఇద్దరు చిన్న పసికందులను ఒంటరిగా పెంచడం, వారి పోషణ చూసుకోవడం ఆ పేద తండ్రికి ఆర్థికంగా భారంగా మారింది. ఈ నిస్సహాయ స్థితిని కొంతమంది స్వార్థపరులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పిల్లలను సాకలేడనే బలహీనతను ఆసరాగా చేసుకుని దత్తత ముసుగులో

మిగతా 2లో..





## ఆహార పదార్థాల ప్యాకెట్లపై స్పష్టమైన లేబుల్స్ ఉండాలి

- మీరు చేస్తారా? మమ్మల్ని చేయమంటారా?
- కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక

02




## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర

- త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

02

## ఉన్నమాటలే చెప్పా.. తగ్గని పోచారం

- కేసీఆర్‌ను మర్చిపోలేనని పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటన
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌ను కలిశాన వెల్లడి
- తాను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని స్పష్టీకరణ
- కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల కొరతపై తీవ్ర అసంతృప్తి
- మంత్రులు ఫోన్లు ఎత్తడం లేదని సీఎం ముందే నిలదీత
- ఉమ్మడి నిజామాబాద్ రాజకీయాల్లో ఈ వ్యాఖ్యల కలకలం



విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఆయన చేసిన తాజా కామెంట్లు అధికార కాంగ్రెస్ పార్టీలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్

మిగతా 2లో..

## ముఖ్యమంత్రా లేక రియల్ ఎస్టేట్ ఏజెంటువా?

- రేవంత్‌ను రియల్ ఎస్టేట్ ఏజెంటా అని నిలదీసిన హరీశ్ రావు
- రాయదుర్గంలో హెరిటేజ్ భూముల వేలంపై బహిరంగ లేఖ
- కోర్టు వివాదాలున్న భూముల వేలంపై తీవ్ర ఆగ్రహం
- ఇంచు భూమి కూడా అమ్మబోమన్న హామీ ఏమైందని ప్రశ్న
- టీజీఐఐసీ భూముల వేలాన్ని వెంటనే ఆపాలని డిమాండ్
- వివాదాస్పద విక్రయాలు ఆపకపోతే చరిత్రహీనుడిగా మిగిలిపోతావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా భూములు అమ్ముతుండటంపై బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రా లేక రియల్ ఎస్టేట్ ఏజెంటువా

మిగతా 2లో..

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై స్పష్టమైన లేబుల్స్ ఉండాలి

**విశాలభారతి, న్యూఢిల్లీ:**

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై స్పష్టమైన హెచ్చరిక లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గరాదని స్పష్టం చేసింది. అవసరమైతే తామే ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే. వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ ( ఎఫ్ఎస్ఎస్ఏఐ ) వ్యవహరిస్తున్న తీరుపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్యాకెట్ ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలకే ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని వాదించారు. హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు తదితరాలను రోజువారీగా ఎంత మోతాదులో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైన స్థాయిలో అవగాహన కల్పించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకుందో వివరించాలని కోరింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. వినియోగదారులు తాము కొనుగోలు చేసి తినే ఆహారంలో ఎంత మొత్తంలో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు ఉన్నాయో తెలుసుకునే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేసింది. ఉత్పత్తిపై హెచ్చరిక లేబుల్ ఉన్నప్పటికీ దానిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని ధర్మాసనం పేర్కొంది.

## ఉన్నమాటలే చెప్పా.. తగ్గని పోచారం

**మొదటిపేజీ తరువాయి**



వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీశాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణంలో ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయమని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం కేవలం నియోజకవర్గ పెండింగ్ పనుల కోసమేనని వివరణ ఇచ్చారు. ఎవరికోసం తాను పదవులు వదలలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ భిక్ష పెట్టారని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అన్నం పెట్టిన నాయకుడిని ఎప్పటికీ మరచిపోలేనని పునరుద్ఘాటించారు. అలాంటి మహానుభావుడిని ద్రోహం చేయడం తన నైతికతకు విరుద్ధమని తేల్చి చెప్పారు. సొంత పార్టీ నేతల నుంచి సరైన స్పందన రావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార మార్పు తర్వాత నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఎమ్మెల్యే పోచారం నేరుగా ముఖ్యమంత్రిని ఆశ్రయించారు. అయితే ఆరు నెలల్లో రావాల్సిన పెండింగ్ బిల్లులు సగమే అందడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. మంత్రులు అలాగే సీనియర్ నాయకులు తన ఫోన్ కాల్స్ సైతం లిఫ్ట్ చేయడం లేదని సీఎం సమక్షంలోనే బహిరంగంగా నిలదీశారు. తన నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను డబ్బుల కోసం లేదా పదవుల కోసం ఎప్పుడూ రాజకీయం చేయలేదని చెప్పారు. తనపై స్వార్థం ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచే తప్పుకుంటానని సవాల్ విసిరారు. ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే తన అడుగులు ఉంటాయని మరోసారి తేల్చి చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ తో కలిసి నడిచిన అనుభవం పోచారం శ్రీనివాసరెడ్డి సొంతం. సీనియర్ నాయకుడిగా ఆయన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బలమైన పట్టు కలిగి ఉన్నారు. అలాంటి సీనియర్ నేత ఇప్పుడు సొంత ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని ఆయన నిరూపించారు. కేవలం నిధుల సాధన కోసమే తాను పార్టీ మారినట్లు చెప్పినప్పటికీ కేసీఆర్ పై ఆయన చూపిన అభిమానం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ పెద్దలపై ఒత్తిడి తెస్తూనే మరోవైపు బీఆర్ఎస్ తో ఉన్న అనుబంధాన్ని ఆయన వదులుకోవడం లేదు. ఈ పరిణామాలు చూస్తుంటే ఆయన భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. కొంతమంది ఆయన మళ్లీ సొంత గూటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని గుసగుసలాడుతున్నారు. మరికొందరు మాత్రం కేవలం నిధులు రాబట్టేందుకే ఈ వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో నేతల ద్వంద్వ వైఖరి ప్రజలకు ఇట్టే అర్థమవుతోంది. యువతకు కూడా నేతల మాటల వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో స్పష్టంగా తెలుసు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మోసం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. ఏ నాయకుడైనా ప్రజల సంక్షేమం కోసం పని చేస్తేనే చరిత్రలో నిలిచిపోతారు. లేదంటే ప్రజలు సరైన సమయంలో తగిన తీర్పు చెబుతారు. పోచారం శ్రీనివాసరెడ్డి లాంటి సీనియర్ నాయకులు కేవలం పదవుల కోసం కాకుండా ప్రజల నమ్మకం కోసం పని చేయాలి. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రావడం లేదనే సాకుతో పార్టీలు మారడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు వస్తున్నాయి. యువత ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ప్రతి పరిణామాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తోంది.

# బడి ఎత్తితే ఉద్యోగం ఊడినట్టే!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడం మధ్యాహ్న భోజనం నాణ్యత మెరుగుపరచడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బోధన ప్రమాణాలు పెంచే దిశగా అధికారులు అనేక చర్యలు అమలు చేస్తున్నారు. తాజాగా ఉపాధ్యాయుల గైర్హాజరు అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. పాఠశాలలకు సరిగ్గా రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే ఉపాధ్యాయులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ముందస్తు అనుమతి లేకుండా నిరంతరం ఒక సంవత్సరం పాటు విధులకు గైర్హాజరైతే సర్వీసు నుంచి తొలగించే నిబంధనను కచ్చితంగా అమలు చేయనున్నారు. ఐదు సంవత్సరాలు విధులకు దూరంగా ఉంటే వారిని సర్వీసుకు రాజీనామా చేసినట్లుగానే పరిగణిస్తారు. గతంలో ఇలాంటి నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా ఇప్పుడు వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ బడులను ప్రక్షాళన చేయాలనే బలమైన సంకల్పంతో ఈ కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిబంధనల అమలులో ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారులు జిల్లా విద్యాధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. గైర్హాజరైన ఉపాధ్యాయులపై సకాలంలో చర్యలు తీసుకోకపోతే ఆయా అధికారుల మీదే వేటు పడుతుందని హెచ్చరించారు. కేవలం తప్పు చేసిన ఉపాధ్యాయుడిపైనే కాకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఈ నిబంధన వలన విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పూర్తిగా పెరుగుతుంది. గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతోంది. ఈ పరిస్థితిని మార్చడానికి స్థానిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉపాధ్యాయులు విధులకు రాని పక్షంలో వెంటనే రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఏ చిన్న నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకమైన పద్ధతిలో ఈ నిబంధనలు అమలు జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా ప్రభుత్వ విద్యారంగంలో క్రమశిక్షణ అనేది మళ్లీ గాడిలో పడుతుందని అందరూ గట్టిగా నమ్ముతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరుకాకపోతే బోధన తీవ్రంగా దెబ్బతింటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మార్జినల్ వర్గాల పిల్లల చదువులు పూర్తిగా వెనుకబడిపోతాయి. విద్యాశాఖ తీసుకున్న తాజా నిర్ణయం ద్వారా ఉపాధ్యాయులలో పని సంస్కృతి మెరుగుపడుతుందని ఆశించవచ్చు. అనవసర గైర్హాజరు తగ్గితే తరగతి గదుల్లో సాధారణ బోధన సజావుగా సాగుతుంది. అయితే నిజమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు తగిన వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉంది. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యే వారిని మాత్రమే ఈ కఠిన నిబంధనలు కట్టడి చేస్తాయి. అర్హులైన వారికి సరైన న్యాయం చేస్తూనే నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా చర్యలు తీసుకోవాలి. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయుల లభ్యత పెరిగితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ఈ మార్పుల వలన ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుంది. విద్యారంగంలో గుణాత్మక మార్పు రావాలంటే ఇలాంటి కఠిన నిర్ణయాలు అమలు చేయడం ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కఠిన నిబంధనలు ఆచరణలో పెట్టే సమయంలో కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. గైర్హాజరైన ఉపాధ్యాయుల రికార్డులను పక్కాగా నిర్వహించడం సకాలంలో నోటీసులు జారీ చేయడం అధికారులకు పరీక్షగా మారుతుంది. ఏ ఒక్కరిపై కూడా కక్షసాధింపు చర్యలు జరగకుండా పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. అధికారులు ఎలాంటి జాప్యం చేయకుండా ఉంటేనే స్థానిక స్థాయిలో జవాబుదారీతనం సక్రమంగా ఉంటుంది. అనవసరమైన జాప్యం వల్ల తప్పు చేసిన వారు తప్పించుకునే అవకాశం ఉంటుంది కాబట్టి అప్రమత్తత ముఖ్యం. డిజిటల్ హాజరు వ్యవస్థలను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా తప్పులకు ఆస్కారం లేకుండా చూడవచ్చు. కేవలం శిక్షల గురించి మాత్రమే కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. పాఠశాలల్లో అనుకూలమైన వాతావరణం ఉంటే ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా విధులకు హాజరవుతారు. కఠినమైన చర్యలు ఒకవైపు ఉంటే ఉపాధ్యాయులను ప్రోత్సహించే విధానాలు మరోవైపు ఉండాలి. అప్పుడే విద్యా వ్యవస్థలో అనుకున్న ఫలితాలు సాధించడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు కావాలి. హాజరు పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి ప్రతి పాఠశాలపై నిరంతరం నిఘా ఉంచాలి. ఉపాధ్యాయులకు మెరుగైన వసతులు కల్పిస్తూనే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా చూడాలి. నేటి డిజిటల్ తరానికి అర్థమయ్యే రీతిలో విద్యా వ్యవస్థలో ఆధునిక మార్పులు తీసుకురావాలి. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుంది. అదే సమయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిని సహించేది లేదనే స్పష్టమైన సందేశాన్ని ప్రభుత్వం పంపింది. ఈ సమతుల్య విధానం వల్ల పాఠశాలల పనితీరులో స్పష్టమైన మార్పు వస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ధైర్యంగా ప్రభుత్వ పాఠశాలలకు పంపే వాతావరణం ఏర్పడుతుంది. అందరి సమష్టి కృషితో తెలంగాణ విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలవాలి. ఈ అడుగులు భవిష్యత్తులో మన విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## అమ్మ లేదని.. అమ్మేశారు!

**మొదటిపేజీ తరువాయి**

వేరే వాళ్లకు అమ్మేందుకు కుట్ర పన్నారు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా గాలికొదిలేసి ఒకే తల్లికి పుట్టిన కవలలను వేర్వేరు కుటుంబాలకు విడదీసి అప్పగించారు. ఈ అక్రమ ఒప్పందంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. తల్లి ప్రేమకు దూరమైన ఆ పసివాళ్ల భవిష్యత్తుతో కొందరు ఆడుకోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పేదరికాన్ని అడ్డుపెట్టుకుని పిల్లలను బేరం పెట్టే ఇలాంటి నీచమైన సంస్కృతి మన సమాజంలో ఇంకా కొనసాగుతుండటం నిజంగా సిగ్గుచేటు. తల్లి లేని పిల్లలను పెంచే ఆర్థిక స్థోమత లేకపోతే వారికి ఎవరో ఒకరు చట్టబద్ధంగా సాయం చేయాలి తప్ప ఇలా అమ్మేసే హక్కు ఎవరికీ లేదు. కానీ ఇక్కడ దత్తత పేరుతో ఒక చీకటి ఒప్పందం నడిచింది. అసలు ఈ దత్తత చట్టాలు ఏమి చెబుతాయి? పిల్లల భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కఠినమైన నిబంధనలు పెట్టింది. ఎవరికి పడితే వారికి పసి పిల్లలను ఇచ్చేయడానికి కుదరదు. అధికారిక మార్గాలను అనుసరించకుండా నేరుగా డబ్బులు తీసుకుని పిల్లలను ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా ఘోరమైన నేరం. రాయికల్ ఘటనలో బాధ్యతారహితంగా ప్రవర్తించిన తండ్రితో పాటు పిల్లలను కొనుగోలు చేసిన రెండు కుటుంబాలపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. కేవలం బాధ్యులు మాత్రమే కాకుండా ఈ అక్రమ ఒప్పందాలకు పత్రాలు రాసిచ్చిన నోటరీ లాయర్ మీద కూడా కేసులు పెట్టారు. పసికందుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి ముఠాల బండారం పోలీసుల సమగ్ర దర్యాప్తులో పూర్తిగా బయటపడాల్సి ఉంది. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ఎవరికైనా కఠినమైన శిక్ష పడినప్పుడే సమాజంలో భయం ఉంటుంది. ఈ దారుణ ఘటనపై ఇప్పుడు సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయనే సాకుతో సొంత బిడ్డలను దూరం చేసుకోవడం ఎంతవరకు సమంజసం? కవల పిల్లలను విడదీయడం వల్ల వారి మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది. రాయికల్ కేసుకు సంబంధించి పోలీసులు పలు కీలక ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలి. పిల్లలను ఎవరి మధ్యవర్తిత్వం ద్వారా వేరే వాళ్లకు అప్పగించారు? నిజంగానే పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయా? ఆ నోటరీ పత్రాలలో ఏయే నిబంధనలు రాశారు? ఇవన్నీ ఇప్పుడు తేలాలి. ఆ పసివాళ్లకు ఏ తప్పుతెలియదు.



తల్లి చనిపోయింది, తండ్రి చేతకానివాడయ్యాడు. ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు దందా చేయడం దారుణం. డబ్బుల కోసం చిన్న పిల్లలను సరుకులుగా మార్చే ఈ దౌర్భాగ్య పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి నిస్సహాయ కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు రావాలి. అప్పుడే ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ఆపగలం. ఈ మొత్తం వ్యవహారంలో అసలైన బాధితులు ఆ చిన్నారులేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పుట్టుకతోనే అమ్మను కోల్పోయి, ఇప్పుడు కనీసం తోబుట్టువుల సావాసం కూడా దక్కకుండా వేర్వేరు ప్రాంతాలకు బలవంతంగా తరలించబడ్డారు. దత్తత అంటే అభాగ్యులకు ఆశ్రయం కల్పించడం, అంతేగాని వ్యాపార వస్తువులుగా మార్చడం కాదు. డబ్బుల కోసం కన్న బిడ్డలను అమ్ముకోవడం మానవతే లేని చర్య. రాయికల్ ఘటన మన వ్యవస్థలో ఉన్న లోపాలను, కొందరి మనుషుల మృగ్య ప్రవర్తనను కళ్లకు కట్టినట్లు చూపుతోంది. అధికారులు ఇప్పటికైనా మేల్కొని ఈ కవల పిల్లలను సురక్షిత ప్రాంతానికి చేర్చాలి. వారికి మంచి భవిష్యత్తును అందించేలా బాధ్యత తీసుకోవాలి. కేవలం కేసు నమోదు చేసి ఊరుకోకుండా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలి. పేదరికంలో ఉన్నవారికి అండగా నిలవాలి కానీ వారి బలహీనతను ఆసరాగా చేసుకుని మోసం చేసే రాక్షసులను ఉపేక్షించకూడదు. ఈ ఆధునిక కాలంలో కూడా మూఢనమ్మకాలు, ఆర్థిక అసమానతలు మనుషులను ఎంతకైనా తెగించేలా చేస్తున్నాయి. రాయికల్ ఘటన మన కళ్ల ముందు కదులుతున్న ఒక హెచ్చరిక గంట. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా నిరుపేదలకు సరైన ఉపాధి, రక్షణ లేకపోతే ఇలాంటి నేరాలు జరుగుతూనే ఉంటాయి.

# కాంగ్రెస్ నిజమైన సెక్యులర్ పార్టీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిజమైన లౌకికవాద సంస్థ అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీల ఎక్సెలెన్స్ సమ్మిట్ ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లిం ప్రజలు రెండు కళ్లలాంటి వారని అభివర్ణించారు. దేశంలోని అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి కోసమే కాంగ్రెస్ నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. గతంలో ముస్లిం సోదరులకు నాలుగు శాతం రిజర్వేషన్లు అందించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని గుర్తు చేశారు. ఈ సముచిత రిజర్వేషన్లను అడ్డుకోవాలని ప్రతిపక్షాలు అనేక రకాల కుట్రలు పన్నాయని మండిపడ్డారు. కొందరు వ్యక్తులు రాజకీయ స్వార్థం కోసం ఏకంగా న్యాయస్థానాలను ఆశ్రయించారని తీవ్రంగా ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ అగ్రనేతలు నరేంద్ర మోదీ అమిత్ షాలు సైతం ఈ రిజర్వేషన్లను రద్దు చేయలేకపోయారని ఎత్తి చూపారు. గతంలో అమిత్ షా తెలంగాణలోని చేవెళ్ల గడ్డపై బహిరంగంగా మాట్లాడుతూ మైనార్టీల రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. దమ్ముంటే గుజరాత్ రాష్ట్రంలో రిజర్వేషన్లను రద్దు చేయాలని తాము అమిత్ షాకు ధైర్యంగా సవాల్ విసిరామని సభలో వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనా విధానాలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలకులు ఉద్యోగాల నియామకాల ప్రక్రియలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గతంలో ఓ సాధారణ ఆర్ఎంపీ వైద్యుడిని టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించి వ్యవస్థను భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో ఒక్క గ్రూప్ వన్ పరీక్షను కూడా పారదర్శకంగా నిర్వహించలేకపోయారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం గ్రూప్ వన్ పరీక్షా పత్రాలను బజార్లో పల్లీలు బటానీలు అమ్మినట్లు అమ్ముకుందని ఘాటుగా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల సంక్షేమం కోసం టీజీపీఎస్సీని సమూలంగా ప్రక్షాళన చేసినట్లు చెప్పారు. దేశంలోని యూపీఎస్సీ సంస్థ తరహాలో టీజీపీఎస్సీని అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దామని స్పష్టం చేశారు. ఒక సమర్థుడైన రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ చైర్మన్ పదవిలో నియమించి వ్యవస్థ గౌరవాన్ని కాపాడామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఎటువంటి అన్యాయం జరగకుండా పారదర్శక పద్ధతిలో ఉద్యోగాల భర్తీ చేపడుతున్నామని భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఓట్ల సర్వే ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వ్యూహాత్మకంగా ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీల ఎక్సెలెన్స్ సమ్మిట్ వేదికగా ఆయన మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. తెలంగాణలో ఏకంగా డెబ్బై లక్షల ఓట్లు తొలగించనున్నట్లు వార్తలు వస్తున్నాయని సీఎం హెచ్చరించారు. చిన్న చిన్న సాంకేతిక పొరపాట్ల కారణంగా సామాన్య ప్రజల ఓట్లు పోకూడదని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కొందరు నాయకులు పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణే తమ తదుపరి టార్గెట్ అంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యర్థులు ఎటువంటి కుట్రలు పన్ని ఓట్లు తొలగించినా వారి పన్నాగాలు ఏమాత్రం ఫలించకూడదని కాంగ్రెస్ శ్రేణులను అప్రమత్తం చేశారు. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో నిఘా ఉంచి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సీఎం తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేస్తూనే అన్ని కులాలు మతాల అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. సామాజిక భద్రత కల్పించడంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని వెల్లడించారు. యువతకు నాణ్యమైన విద్య మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కష్టపడి పనిచేసే నాయకులకు కార్యకర్తలకు ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా కచ్చితంగా ఇస్తున్నామన్నారు. ప్రజాపాలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులను కేటాయించి వారి జీవితాల్లో ఉజ్వల మార్పులు తీసుకువస్తున్నామని వివరించారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న తరుణంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. తెలంగాణ గడ్డపై లౌకిక విలువలను పరిరక్షించడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే శక్తులను ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మైనారిటీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. రాబోయే కాలంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు పార్టీ శ్రేణులు సైనికులా కష్టపడాలని సూచించారు. ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా అందరినీ సమానంగా ఆదరించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఉద్ఘాటించారు. కులమతాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే సంకుచిత శక్తుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమ్మిట్ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ నాయకులు మంత్రులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ప్రశంసించారు.



## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర

**న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలో విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు ధరల స్థిరీకరణతో విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గే అవకాశం ఉందన్నారు. సిమెంట్, స్టీల్ తదితర రంగాలకు సంబంధించిన ధరల పెరుగుదలను నియంత్రించేందుకు కూడా కేంద్రం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**రాష్ట్రాల హక్కులకు భంగం కలగదు**

మినరల్స్ విషయంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో ఖనిజాల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం పలు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఖనిజ వనరుల సమర్థ వినియోగం, ఉత్పత్తి పెంపు ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.



# ముఖ్యమంత్రా లేక రియల్ ఎస్టేట్ ఏజెంటువా?

**మొదటిపేజీ తరువాయి**

అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మడమేనా అని ధ్వజమెత్తారు. నాడు ప్రభుత్వ భూములు జాతి సంపద అని ఉపన్యాసాలిచ్చి నేడు వేలం వేస్తున్నారంటూ విమర్శించారు. ఇంచు భూమిని అమ్మబోమన్న హామీ ఏమైందని ప్రశ్నిస్తూ సీఎంకు బహిరంగ లేఖ రాశారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, రాయదుర్గం వంటి ప్రాంతాలలో భూములు అమ్మే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాయదుర్గం పన్మక్త గ్రామంలోని సర్వే నంబర్ 83/1లో గల పది ఎకరాల హెరిటేజ్ భూమిని టీజీఐఐసీ వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడి అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం తగదని స్పష్టం చేశారు. అనుయాయులకు మేలు చేసేందుకే ఈ వేలాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. రెండవ దశాబ్దపు ప్రారంభంలో ఇవే భూములపై రక్షణ కోరుతూ కోర్టు మెట్లు ఎక్కిన రేవంత్ రెడ్డి నేడు సీఎం అయ్యాక థర్డ్ పార్టీ హక్కులు సృష్టించేలా ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. జీవో నంబర్ 4 ద్వారా ఈ సర్వే నంబర్‌ను హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని వేలం వేయడానికి ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. గతంలో ఇదే సర్వే నంబర్‌లో కొంత భూమిని వేలం వేస్తే ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించిందని గుర్తుచేశారు. కోర్టు ఆంక్షలు విధించినా, ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉన్నా మళ్లీ వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని నిలదీస్తూ ఈ భూమిపై యాజమాన్య వివాదాలు, వక్ఫ్ హక్కుల సమస్యలు ఉన్నాయని తెలిపారు. అనేక కోర్టు వివాదాలు ఉన్నప్పుడు భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. వేల కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షుడిగా



ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చడం సిగ్గుచేటన్నారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమని అసెంబ్లీ సాక్షిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన మాటకు విలువ లేదా అని నిలదీశారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు తీర్పులను లెక్కచేయకుండా వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 15, 21 తేదీల్లో జరగనున్న టీజీఐఐసీ వేలాలను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హక్కులు వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమైన చర్య అని ఆక్షేపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రిలా వ్యవహరించాలని హితవు పలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని హెచ్చరించారు. ప్రజాధనాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ప్రజల ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ఇలాంటి పనులకు పాల్పడటం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సర్ ఎసరు..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్రియ ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్ర టెన్షన్‌లో పడ్డాయి. గతంలో ఉన్న ఓటర్లు ఎంత మంది, ఫారాలు సమర్పించింది ఎంత మంది, ఈ నెల 17న వచ్చే ముసాయిదా జాబితాలో ఉండేది ఎంత మంది అనే అంశాలపై పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. మొత్తం 73 లక్షలకు పైగా ఓట్లు తొలగిపోయే అవకాశం ఉండగా అందులో 43 లక్షలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉండటం విశేషంగా మారింది. జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఈ భారీ ఓట్ల తొలగింపు ప్రభావం తమ ఓటు బ్యాంక్‌పై పడుతుందని అన్ని పార్టీలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. ఈ ముసాయిదా జాబితా విడుదల తర్వాత రాష్ట్ర రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలన్నీ తమ తప్పులను సరిదిద్దడానికి రకరకాల మార్గాలను వెతుకుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే అప్రమత్తం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రాకపోవడం పెద్ద సమస్యగా మారింది. అర్హుల ఓట్లు డిలీట్ కాకుండా చూసుకోవాలని జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ఆయన గట్టిగా హెచ్చరించారు. స్వయంగా సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా సుమారు 34 వేల మంది పేర్లు గల్లంతైనట్లు ప్రాథమిక సమాచారం వస్తోంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తరచూ జూమ్ మీటింగ్‌లు నిర్వహించి లీడర్లను అప్రమత్తం చేసినా పెద్దగా ప్రయోజనం కన్పించలేదు. డ్రాఫ్ట్ లిస్ట్ బయటకు వచ్చిన తర్వాత ఏయే నియోజకవర్గాల్లో ఎంత మంది కోల్పోయారనే దానిపై పూర్తి స్థాయి రివ్యూ నిర్వహించి తిరిగి ఓట్లు చేర్పించేందుకు పీసీసీ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ మరింత చురుగ్గా పాల్గొని ఓటర్లను కాపాడుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ సర్ ప్రక్రియ వల్ల భారీ నష్టం జరుగుతుందని చాలా ముందే ఊహించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బూత్ లెవెల్ ఏజెంట్లకు, లోకల్ లీడర్లకు దీనిపై పూర్తి అవగాహన కల్పించారు. గ్రేటర్ పరిధిలో కేటీఆర్, హరీశ్‌రావు ప్రత్యేక సమావేశాలు పెట్టినా దాదాపు 43 లక్షల పైచిలుకు ఓట్లు గల్లంతు కావడం గులాబీ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ముఖ్యంగా ఓట్లు కోల్పోతున్న చాలా స్థానాలు బీఆర్ఎస్ సిట్టింగ్ నియోజకవర్గాలే కావడంతో ఆ పార్టీ నేతలు తీవ్రంగా కలవరపడుతున్నారు. ఈ భారీ డ్యామేజ్‌ను కంట్రోల్ చేసేందుకు తక్షణమే ఎలాంటి మెకానిజం అమలు చేయాలనే దానిపై పార్టీ అధినేతలు తీవ్రంగా చర్చిస్తున్నారు. రాబోయే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక గులాబీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ మ్యాపింగ్ ప్రాసెస్ సమయంలోనే అప్రమత్తమై బూత్ స్థాయి లీడర్లను రంగంలోకి దించారు. ఓల్డ్ సిటీ పరిధిలోని చాంద్రాయణగుట్ట, మలక్‌పేట్, యాకుత్‌పుర, కార్వాన్ ప్రాంతాల్లో సుమారు ఆరు లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీస్ వెల్లడించిన గణాంకాల ప్రకారం లక్షలాది మంది ఆచూకీ దొరకకపోవడం మజ్లిస్ నాయకుల్లో గుబులు రేపుతోంది. దీంతో ముసాయిదా జాబితా బయటకు రాగానే సరైన ఆధారాలు చూపించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు మళ్లీ నమోదు చేయించేలా ఆ పార్టీ నాయకత్వం పకడ్బందీ ప్రణాళికలు రచిస్తోంది. స్థానిక ప్రజలకు అండగా నిలుస్తూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని ఆ పార్టీ పెద్దలు నిర్ణయించారు. మైనారిటీ ఓట్లు గల్లంతు కాకుండా చూడటానికి తగిన ముందస్తు చర్యలు వేగంగా తీసుకుంటున్నారు. మరోవైపు బీజేపీ ఈ పరిణామాన్ని మొదటి నుంచి పూర్తిగా స్వాగతిస్తూ చాలా స్పష్టమైన వ్యూహంతో ముందుకు వెళుతోంది. ఓల్డ్ సిటీ ప్రాంతంలో బోగస్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని ఆ పార్టీ ప్రారంభం నుంచి బలంగా ఆరోపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఓట్లు పెద్ద ఎత్తున తొలగిపోవడం తమకు రాజకీయంగా కలిసి వస్తుందని కమల దళం గట్టిగా నమ్ముతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఈ మార్పులు తమ విజయావకాశాలను మెరుగుపరుస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో ముసాయిదా లిస్ట్ ఆధారంగా రాబోయే ఎన్నికల యుద్ధానికి సరికొత్త వ్యూహాలను రచించేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని చూస్తున్న కాషాయ పార్టీకి ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ బాగా ఉపయోగపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి.






# గ్రామ పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్

- **తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్**

**విశాలభారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం పల్లె (హరిపూర్) గ్రామంలో గురువారం రోజు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి, సలహా మేరకు గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 4 గురు కార్మికులకు గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్, వారి స్వంత ఖర్చులతో 10లక్షల ప్రమాద భీమా ఐపిపిబి లో చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సూరకంటీ చిన్నారెడ్డి, పల్లె కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్క రంజిత్, గ్రామ సర్పంచ్ ల చేతుల మీదుగా ప్రమాద భీమా బాండ్లను కార్మికులకు అందజేశారు. అనంతరం ఎస్కె.చిన్నా రెడ్డి, మాట్లాడుతూ సర్పంచ్ తన స్వంత నిధులతో పంచాయతీ కార్మికులకు 10లక్షల ప్రమాద భీమా చేయించడం అభినందనీయ విషయమని అన్నారు. అనూహ్య ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక భద్రతను ధైర్యాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. ఎప్పటికి ప్రజల్లో ఉంటు ప్రజల అవసరాలను తెలుసుకుంటూ వారి అవసరాలను తీరుస్తూ కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎంపిటిసి జన్నేపల్లి గంగాధర్, మాట్లాడుతూ ప్రస్తుతం మన బిజీ లైఫ్ కి ప్రమాద బీమా పాలసీని కలిగి ఉండటం చాలా అవసరమని, వారికి అనుకోకుండా ప్రమాదం జరిగినప్పుడు ఆర్థిక భద్రతను కల్పిస్తుందనీ తద్వారా వారికి వారి కుటుంబాలకు ఆర్థిక పరమైన ఇబ్బందులు రాకుండా ఉంటాయనీ అన్నారు. ప్రీమియం చిన్నదైనా ఆలోచన పెద్దదని గ్రామ సర్పంచ్ మనీషా సంజీవ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు సరదా గంగాధర్, కార్యదర్శి ఆది శ్రీను, మాజీ అధ్యక్షుడు రాంసన్, సీనియర్ నాయకులు భైరగోని సాయగౌడ్, కొంపెల్లి సుధాకర్, బోజేందర్, సాయిలు, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఫెయిల్!

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ వాతావరణం వేడెక్కింది. యువత నుంచి సాధారణ ప్రజల వరకు ఈ అంశంపై చర్చ జరిగేలా గులాబీ శ్రేణులు వ్యూహం రచించాయి. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా ప్రతి రోజూ కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారు. ఈ విమర్శల దాడిని ఎదుర్కొనే శక్తి హస్తం పార్టీలో కొరవడింది. ప్రత్యర్థుల వ్యూహాలను ముందుగా పసిగట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా స్పందించకపోవడం ఆశ్చర్యకరంగా మారింది. మంత్రులు, సీనియర్ నాయకులు ఈ వివాదంపై మౌనం వహిస్తున్నారు. కేవలం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే మీడియా ముందుకు వచ్చి వివరణ ఇస్తున్నారు. గత ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగినట్లు ఆయన స్పష్టం చేస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి కోసమే భూములు ఇచ్చామని, ఎలాంటి అక్రమాలు జరగలేదని చెబుతున్నారు. చట్టబద్ధమైన పద్ధతిలోనే అన్నీ జరిగాయని క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కేటాయించిన భూములను పరిశ్రమల ఏర్పాటుకే వాడాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు తావులేదని ఆయన వివరిస్తున్నారు. అయితే ఈ వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో అధికార పార్టీ నాయకులు విఫలమవుతున్నారు. సోషల్ మీడియా యుగంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంలో కాంగ్రెస్ యంత్రాంగం వెనుకబడిపోయింది. పార్టీ అగ్రనేతల మౌనం శ్రేణులలో తీవ్ర నిరుత్సాహాన్ని నింపుతోంది. సమర్థమైన నాయకత్వం లేకపోవడం వల్ల ఆరోపణలను తిప్పికొట్టలేకపోతున్నారు. గులాబీ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలకు సరైన రీతిలో కౌంటర్లు పడటం లేదు. ఆ కంపెనీకి కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని నిరూపించడంలో అధికార పక్షం తడబడుతోంది. కేవలం సాధారణ ప్రకటనలతో సరిపెట్టడం వల్ల ప్రజల్లో అనుమానాలు బలపడుతున్నాయి. ప్రతిపక్షం వేస్తున్న ముద్రను సమర్థవంతంగా తొలగించలేకపోతున్నారు. ముఖ్యమంత్రి కుటుంబంపై వస్తున్న విమర్శలను సమూహంగా తిప్పికొట్టే నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టెన్షన్ వాతావరణంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన పార్టీ పెద్దలు సైలెంట్‌గా ఉండటం కార్యకర్తలను నిరుత్సాహపరుస్తోంది. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వైరల్ చేస్తున్న అంశాలకు సరైన డాక్యుమెంట్లతో సమాధానం ఇవ్వాలి. ఈ చిన్న లోపమే భవిష్యత్తులో పెద్ద నష్టాన్ని తెచ్చే అవకాశం ఉంది. ప్రత్యర్థుల మైండ్ గేమ్‌ను అర్థం చేసుకుని ముందుకు సాగడంలో కాంగ్రెస్ పెద్దలు మరింత వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి రాజకీయ దాడులను ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. ప్రస్తుత డిజిటల్ జనరేషన్‌కు ప్రతి విషయం చాలా త్వరగా అర్థమవుతుంది. సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, పోస్టుల ప్రభావం యువత ఆలోచనలపై గట్టిగా పడుతుంది. కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఇలాంటి దుష్ప్రచారం ప్రభుత్వ మనుగడకే ముప్పుగా మారుతుంది. అవినీతి ముద్ర పడితే ప్రజలు త్వరగా నమ్ముతారు కాబట్టి ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాలి. సోషల్ మీడియా విభాగం మరింత చురుగ్గా పనిచేసి ప్రతి ఆరోపణకు లాజిక్‌తో కూడిన సమాధానాలు ఇవ్వాలి. లేదంటే నిజం గొంతు దాటేలోపు అబద్ధం ఊరంతా తిరుగుతుందనే సామెత నిజమవుతుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేలుకొని ఒక ప్రత్యేక వ్యూహంతో ముందుకు రావాలి. లేనిపక్షంలో గులాబీ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారమే నిజమని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే పారదర్శకతతో పాటు దూకుడు కూడా చాలా ముఖ్యం. ప్రజాక్షేత్రంలో గెలవాలంటే నిరంతరం శ్రమించాల్సిందే.




# తప్పు చేస్తే రేవంత్‌ని కూడా ప్రశ్నిస్తా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న ఇరవై ఐదు ఏళ్ల ప్రస్థానంపై రాసిన పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర రాజకీయాలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తాను అధికార పక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మంచి చేస్తే మెచ్చుకుంటానని, తప్పు జరిగితే మాత్రం కచ్చితంగా ప్రశ్నిస్తానని తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కళాకారులు తగిన గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఉద్యమంతో సంబంధం లేని వారు పదవుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంతో గానీ కాంగ్రెస్ పార్టీతో గానీ ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఇవాళ పెద్ద పెద్ద పదవుల్లో కూర్చున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అలాంటి వారిని చూస్తుంటే తనకు చాలా బాధగా అనిపిస్తోందని సభాముఖంగా చెప్పారు. రాష్ట్ర రాజకీయాలను మార్చే, శాసించే పూర్తి శక్తి తనకు ఉందని, తన నిజాయితీనే తన అసలైన బలమని ధీమా వ్యక్తం చేశారు. తాను సొంత నిధులు ఖర్చు పెట్టి ఎంపీలను, ఎమ్మెల్యేలను గెలిపించానని గుర్తు చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి గెలిపించిన నాయకులు ఇప్పుడు తనను పిలిచినా రావడం లేదని మండిపడ్డారు. వారందరికీ ఎక్కడ అధికారం ఉంటే అక్కడికే వెళ్లే అలవాటు ఉందని పరోక్షంగా చురకలంటించారు. కులం, మతం పేరుతో పైకెదిగి వసూల్ రాజాలుగా మారిన నాయకులను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి గెలవగానే నాయకులకు ధనం, అధికారంపై మోజు విపరీతంగా పెరుగుతోందని విమర్శించారు. ఓట్లేసి గెలిపించిన సాధారణ ప్రజలను గాలికి వదిలేస్తున్నారని వాపోయారు. ఉన్నవాళ్లు వేల రెట్లు ఎదుగుతుంటే పేదవాడు మాత్రం అక్కడే ఉంటున్నాడని ఆవేదన వెలిబుచ్చారు. పైన ఉన్నవారు లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. కానీ ఒక పేదవాడికి ఐదు లక్షల ఇల్లు ఇవ్వడానికి మాత్రం అధికారులు ఐదు వందల నిబంధనలు పెడుతున్నారని దుయ్యబట్టారు. సగం ఇల్లు కట్టుకున్నాక ఇంట్లో ఆటో ఉందనో లేక ట్రాక్టర్ ఉందనో చెప్పి బిల్లులు ఆపేస్తున్నారని సిస్టమ్‌పై అసహనం వ్యక్తం చేశారు. పదవి అనేది ఒక బాధ్యత మాత్రమేనని, దాన్ని అహంకారానికి సాధనంగా మార్చుకోవద్దని హితవు పలికారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు ఏపూరి సోమన్న లాంటి నిజమైన కళాకారులు మళ్లీ గజ్జె కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. నిరుద్యోగులు, రైతులు, మహిళల సంక్షేమం కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇన్నేళ్లు తాను ఎంతో ఓపికతో నిశ్శబ్దంగా ఉన్నానని, ఇకపై మాత్రం మౌనంగా ఉండేది లేదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన ఉద్యమకారులు చట్టసభల్లో అడుగుపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఏపూరి సోమన్న కచ్చితంగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి శాసనసభలో అడుగుపెడతారని జోస్యం చెప్పారు. తాను మాట ఇస్తే దానికి కట్టుబడి ఉంటానని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టమైన హామీ ఇచ్చారు. సోమన్న విజయం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు ఒక రూల్, పెద్దలకు మరో రూల్ అమలు కావడం సరికాదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి సకాలంలో అందాలని కోరారు. ప్రజాధనం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడాలని అభిలషించారు. తెలంగాణలో ఇప్పటికీ పేదలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదనే నిజం గ్రహించాలని సూచించారు. ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా బంగారు తెలంగాణ సాధన దిశగా అడుగులు పడాలని కోరారు. ప్రజల ఆశలను వమ్ము చేస్తున్న నాయకుల భరతం పట్టే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. యువత, విద్యార్థులు, కర్షకులు అంతా ఏకమై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే అమర వీరుల ఆశయాలు నెరవేరుతాయని ఆయన ఉద్ఘాటించారు. ఈ పుస్తకావిష్కరణ సభ వేదికగా రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సొంత పార్టీలోని కొందరి తీరును ఆయన బహిరంగంగా ఎండగట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. కళాకారులకు తగిన ప్రాధాన్యం దక్కాలని, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరగాలని కోరడం అభినందనీయమని సభికులు ప్రశంసించారు. ఏపూరి సోమన్న ఇరవై ఐదు సంవత్సరాల ప్రస్థానాన్ని కొనియాడుతూ ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కళాకారులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని నాయకులు ప్రకటించారు. మొత్తంగా ఈ సభ ద్వారా తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపినట్లయింది.



## న్యూ సాంఫ్లి పాఠశాలలో రూ.12 లక్షల అదనపు తరగతి గదులు ప్రారంభం



- **విద్యార్థులకు మెరుగైన వసతులే లక్ష్యం: ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్**

**విశాలభారతి, కుభీర్ :** నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని న్యూ సాంఫ్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ అవసరమని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. న్యూ సాంఫ్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సమాఖ్య భవనం, గోదాం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు సహా పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నల్లగొండ వైద్యశాఖలో నయా దందా!

**మొదటిపేజీ తరువాయి**

ఆస్పత్రుల్లో దాదాపు 15 మంది సిబ్బందిని ఇష్టారీతిన మార్చేశారు. ఈ వ్యవస్థాగత అవినీతి వల్ల రోగులకు సేవలు అందడం కష్టంగా మారుతోంది. ఆరోగ్య శాఖ అధికారులు ఈ అక్రమాలపై ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్న ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. బాధ్యత గల పదవిలో ఉండి ప్రజాధనాన్ని, అధికారిక హోదాను అడ్డం పెట్టుకుని ఇలా చేయడం విచారకరం. డ్యూటీ ఒక ప్రాంతంలో ఉంటే జీతం మరొక ప్రాంతంలో చెల్లించే విచిత్రమైన పరిస్థితి ఈ జిల్లా ఆస్పత్రుల్లో కనిపిస్తోంది. ల్యాబ్ టెక్నిషియన్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది సేవలు అత్యవసర సమయాల్లో రోగులకు అందడం లేదు. తమ జేబులు నింపుకోవడమే ధ్యేయంగా సదరు అధికారి డబ్బులు ఇచ్చిన వారికి నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పిస్తున్నారు. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఒక సిబ్బందిని తన స్వలాభం కోసం నకిరేకల్ ఆస్పత్రికి పంపడం ఇందులో భాగమే. నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు సిబ్బందిని కూడా ఇదే తరహాలో మౌఖిక ఉత్తర్వులతో మిర్యాలగూడకు తరలించారు. రోగుల కష్టాలతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా చేస్తున్న ఈ బదిలీల వల్ల ఆస్పత్రుల్లోని పనితీరు దెబ్బతింటోంది. వైద్యశాఖలో ఇలాంటి అక్రమాలు జరగడం వల్ల అర్హులైన వారు నష్టపోతున్నారు. పైరవీలు చేసిన వారికి ప్రాధాన్యత దక్కుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ వ్యవహారంపై దృష్టి సారించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలి. తప్పుడు పద్ధతుల్లో జరుగుతున్న ఈ బదిలీలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చింది. ఈ అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారం వెనుక జిల్లా స్థాయి అధికారి కీలక పాత్ర పోషిస్తున్నారని శాఖలోని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. సదరు అధికారి ఏళ్ల తరబడి ఒకే పోస్టులో తిష్టవేసి అవినీతిని పరాకాష్టకు తీసుకెళ్లారు. శాఖలో పనిచేసే ఒక హెడ్ నర్సును ఏజెంట్‌గా నియమించుకుని ఈ దందాను పక్కాగా నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి వసూళ్ల ప్రక్రియ వరకు ఆ హెడ్ నర్సే దగ్గరుండి చూసుకుంటున్నారు. పైసా వసూలు చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తుండటంతో చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బంది నిరాశ చెందుతున్నారు. శాఖలోని నిజాయితీ గల ఉద్యోగులు ఈ అక్రమాలపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన వారే ఇలాంటి పనుల్లో నిమగ్నం అవ్వడం సిగ్గుచేటు. ఒక జిల్లా స్థాయి అధికారి తన అహంకారం కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం శాఖను భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలను కూడా అడ్డుకుంటూ అక్రమార్జనకే పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు పదవుల్లో కొనసాగితే సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే అవకాశం లేదు. అధికారి అవినీతి కేవలం బదిలీలకే పరిమితం కాలేదు. చిల్లర వసూళ్లలోనూ అదేస్థాయిలో కొనసాగుతోంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థుల నుండి సైతం 100 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది అధికారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఆస్పత్రులకు వచ్చే పేద రోగుల నుంచి, ధృవీకరణ పత్రాల కోసం వచ్చే విద్యార్థుల నుంచి డబ్బులు గుంజుకోవడం దారుణం. జిల్లా వ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఎటువంటి రశీదులు లేకుండా సాగుతున్న ఈ వసూళ్లను అడ్డుకునే వారు లేరు. నిబంధనలను బొందపెట్టి ఏరియా ఆస్పత్రుల్లో సాగిస్తున్న ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి. అవినీతిపరులను పదవుల నుండి తొలగిస్తే తప్ప వ్యవస్థలో మార్పు రాదు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే అధికారులకు కఠిన శిక్ష పడాలి. ఇటువంటి అక్రమాలు కొనసాగితే జిల్లాలో వైద్య సేవల పట్ల నమ్మకం పోతుంది. ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగంపై చర్యలు తప్పనిసరి. అవినీతి లేని వైద్యశాఖ కోసం అందరూ డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన జిల్లా స్థాయి అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను పణంగా పెట్టి అక్రమార్జనకు పాల్పడటం నేరం. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి ఈ బదిలీల దందాను మూలాలను వెలికితీయాలి. నిబంధనలను ఉల్లంఘించిన ప్రతి వ్యక్తిపై కఠినమైన శిక్షలు అమలు చేయాలి. అప్పుడే మిగిలిన వారికి ఒక పాఠంలా ఉంటుంది. ప్రభుత్వం ప్రజాక్షేమం కోసం పని చేయాలే తప్ప, కొందరు అధికారుల జేబులు నింపడానికి కాదు. పారదర్శకమైన పాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజాగ్రహం ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంతోమంది సిబ్బంది ఆత్మగౌరవంతో పనిచేయాలని కోరుకుంటున్నారు. అలాంటి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది. అవినీతి రహిత వైద్యసేవలు అందించే దిశగా అడుగులు వేయాలి. ఏ ఒక్కరూ చట్టానికి అతీతులు కారు. జిల్లా స్థాయి అధికారి చేసిన అక్రమాలపై తక్షణమే విచారణ కమిటీని ఏర్పాటు చేయాలి. నిజాలను నిగ్గు తేల్చి దోషులను కటకటాల్లోకి పంపాలి. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.



# రీ సర్వే, ఎస్ఐఆర్, రెవెన్యూ అంశాలపై కలెక్టర్ స్నేహ శబరిష్ సమీక్ష



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి):** జిల్లాలో సమగ్ర భూ రీసర్వే, ఎస్ఐఆర్, సెన్సెస్, రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గురువారం తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తూ పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూ రీసర్వేను జిల్లాలో వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఆధునిక జీపీఎస్, రోవర్ పరికరాలను వినియోగించి భూముల సరిహద్దులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో డిజిటల్ సర్వే నిర్వహించేందుకు మండలాల వారీగా అత్యాధునిక సర్వే పరికరాలను సమకూర్చినట్లు పేర్కొన్నారు. సర్వే ప్రారంభానికి ముందే సంబంధిత గ్రామంలోని రైతులు, పట్టాదారులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు అధికారికంగా సమాచారం అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలను చూపించి భూమి హద్దులను ధ్రువీకరించుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం రూపొందించే డ్రాఫ్ట్ మ్యాప్‌లు, రికార్డులను గ్రామాల్లో ప్రదర్శించాలని తెలిపారు. భూమి సరిహద్దులు లేదా విస్తీర్ణంలో తేడాలు ఉంటే అభ్యంతరాలు తెలిపేందుకు రైతులకు 50 రోజుల గడువు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాల విచారణ అనంతరం తుది రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రీసర్వే ద్వారా ప్రతి భూ కమతానికి ప్రత్యేక భూధార్ సంఖ్యతో పాటు కచ్చితమైన డిజిటల్ మ్యాప్ అందుబాటులోకి వస్తుందని, తద్వారా భవిష్యత్తులో భూ సరిహద్దు వివాదాలు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. నూతన డిజిటల్ భూ రికార్డుల ఆధారంగా డిజిటల్ పట్టాదారు పాస్‌బుక్‌లు అందుబాటులోకి వస్తాయని, బ్యాంకు రుణాలు, భూ క్రయవిక్రయాలు, వారసత్వ మార్పిడి వంటి ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ సూచించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో సర్వే పనులను నిర్వహించాలని, ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు తదితర ప్రభుత్వ ఆస్తులను గుర్తించి పరిరక్షించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటినీ ప్రత్యక్షంగా సందర్శించి ప్రామాణిక సమాచారాన్ని మాత్రమే నమోదు చేయాలని, పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులు, ఫారాలను నిర్ణీత గడువులో సంబంధిత పోర్టల్, యాప్‌లలో నమోదు చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సవరణ అభ్యర్థనలు, అభ్యంతరాలు, పిటిషన్లు, ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలని స్పష్టం చేశారు.

మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి పురోగతిని సమీక్షించాలని తెలిపారు. సిబ్బంది ఎదుర్కొనే సాంకేతిక, ఆచరణాత్మక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక మీడియా, దండోరా, డిజిటల్ మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సాధారణ రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే రెవెన్యూ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల నుంచి వచ్చే రెవెన్యూ వినతులు, భూ సంబంధిత ఫిర్యాదులను నిర్దేశిత కాల పరిమితిలోగా పరిష్కరించాలని తెలిపారు.

పెండింగ్ అర్జీలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని, రైతులు, భూ యజమానులకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తులు, భూ సర్వే ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు వివాదరహిత భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి, స్పందన కార్యక్రమాల్లో వచ్చే దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి బాధితులకు స్పష్టమైన, వేగవంతమైన సమాధానాలు అందించాలని తెలిపారు. మండల పరిధిలోని రెవెన్యూ సమస్యలు, వివాదాస్పద స్థలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై తహసీల్దార్లు, సంబంధిత సిబ్బంది క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు రెవెన్యూ సేవల్లో మధ్యవర్తుల ప్రమేయాన్ని పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిల్లో రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, ఏడీ సర్వే ల్యాండ్ శ్రీనివాసులు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్, పవన్ కుమార్, దామోదర్, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లి గుండ్ల తండలో విషాదం



- రెడ్డి చెరువులో పడి తల్లి, కుమారుడు మృతి

**కురవి విశాల భారతి):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పిల్లి గుండ్ల తండలో గురువారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తండకు చెందిన భూక్య నవ్య, ఆమె కుమారుడు అన్వేష్ రెడ్డి చెరువులో పడి మృతి చెందినట్లు సమాచారం. తల్లి, కుమారుడు ఒకేసారి మృతి చెందడంతో తండలో విషాదఛాయలు అలుముకున్నాయి. భూక్య నవ్య, ఆమె కుమారుడు అన్వేష్ రెడ్డి చెరువులో పడినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అనంతరం ఇద్దరూ మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమారుడు మృతి చెందడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటనతో భర్త అశోక్‌తో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే నవ్య, అన్వేష్ చెరువులో పడటానికి గల కారణాలు, ఘటన ఎలా చోటుచేసుకుంది అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారులు, పోలీసులు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## రాధాకృష్ణ స్వామి, లక్ష్మీ సత్యమ్మ తల్లికి విశేష అభిషేకాలు



**కురవి విశాల భారతి ;**మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండలోని రామాలయంలో శ్రావణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీ రాధాకృష్ణ స్వామి వారికి, శ్రీ లక్ష్మీ సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఆరిపాక సతీష్ ఆచార్యులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ సత్యమ్మ తల్లికి కూడా ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. శ్రావణ మాసం సందర్భంగా గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## రెడ్యా నాయక్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**మరిపెడ,విశాల భారతి:** మాజీ మంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్‌ను కురవి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. గురువారం మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులో రెడ్యా నాయక్ ప్రయాణిస్తున్న కారుకు తృటిలో ప్రమాదం తప్పిన విషయం తెలుసుకున్న నాయకులు ఆయన స్వగృహం ఉగ్గంపల్లికి వెళ్లారు.ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న నాయకులు రెడ్యా నాయక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. భగవంతుని ఆశీస్సులతో పాటు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉంటాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కురవి మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ఉంటాం




**మరిపెడ విశాల భారతి:** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని మరిపెడ మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు.మరిపెడ ఉన్నత పాఠశాలలో బ్రహ్మకుమార్ రామ్మోహన్ బయగాని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడి విధుల బహిష్కరణ



**కోదాడ, విశాలభారతి:** నాగర్‌కర్నూల్ కోర్టు సీనియర్ న్యాయవాది వేమగోపాల్‌రావుపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ కోదాడ కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు పూర్తి రక్షణ కల్పించేలా ప్రభుత్వం, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానం చేసి అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేజెల్లా రంగారావు, రంజాన్ పాషా, సిలివేరు వెంకటేశ్వర్లు, కోదూరు వెంకటేశ్వర్లు, సీతారామరాజు, ఉయ్యాల నర్సయ్య, దావీదు, నాగరాజు, నవీన్, ఎండీ. హుస్సేన్, హేమలత, శిల్పా, సంధ్య, గోవర్ధన్, రియాజ్, తాటి మురళి, పెద్దబాబు, వెంకటేశ్వర బాబు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థులకు షూ పంపిణీ



**ఆర్మూర్ ,విశాల భారతి:** నందిపేట మండలంలోని ఉమ్మెడ గ్రామంలో గురువారం జై భీమ్ యువసేన సంఘం ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. విద్యార్థులకు షూ పంపిణీ చేసినందుకు యూత్ నాయకులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భోజెందర్ ఉప సర్పంచ్ బర్రె ఆనంద్,యూత్ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- డాక్టర్ వేమూరి సత్యనారాయణ



**మునగాల, విశాల భారతి:** నర్సింహాపురం గ్రామంలో ఉన్న వివిధ రకాల విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ లైన్‌మెన్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు, జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దూరంగా తరలించడం, అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ తీగలను అమర్చడం వంటి సమస్యలను డివిజన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.వారి సూచనల మేరకు గ్రామ పంచాయతీ తీర్మాన పత్రంతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక సిబ్బందికి సమర్పించినట్లు పేర్కొన్నారు.

## చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి



**మునగాల, విశాలభారతి;** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కే. వీరబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, కోకో, క్యారమ్స్, చదరంగం మరియు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జే. రామకృష్ణ, బీ. సైదయ్య గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు జానీ భాష, సుష్మిత, వాణిశ్రీ, గాయత్రి, రంజాన్ బేగం, సీహెచ్. రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించడంలో కేంద్రం విఫలం




**మరిపెడ విశాల భారతి:** నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మరిపెడలో సీపీఐ ప్రజా చైతన్య యాత్రను ఆయన ప్రారంభించారు.రైతులకు మద్దతు ధర, అసంఘటిత కార్మికులకు పని భద్రత, యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు. తెలంగాణ విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, జాతీయ ప్రాజెక్టు హోదా, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.'మార్పు కావాలి' నినాదంతో సెప్టెంబర్ 1న చేపట్టనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, అంజి, పాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలు




**మరిపెడ, విశాల భారతి:** వర్షాభావ పరిస్థితుల్లో నీటి కొరతను అధిగమించేందుకు రైతులు ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండల కేంద్రంలోని క్లస్టర్‌లో 'మిషన్ వైవిధ్యం' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. పెసర, కంది, మినుములు, ఆయిల్‌పామ్‌తో పాటు వివిధ కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పెట్టుబడి వ్యయాన్ని నియంత్రించుకోవచ్చన్నారుఆయిల్‌పామ్ సాగుతో నీటి ఆదాతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కూరగాయల సాగు చేపడితే రోజువారీగా ఆదాయం సమకూరుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణ చేపట్టి రైతులు నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ డివిజన్ టెక్నికల్ ఏవో శ్రీదేవి, ఉద్యానవనశాఖ హెచ్‌వో శాంతిప్రియ, ఏఈవోలు ఎన్.శ్రీకాంత్, పి.అన్వేష్, బి.అశోక్, డి.చరణ్, జె.స్రవంతి, సరితతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## గుడిలో దొంగతనం పట్టుబడ్డ దొంగలు



**విశాల భారతి, ఆర్మూర్ ;** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో గల చిలకల చిన్నమ్మ గుడిలో గురువారం రోజు దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను గ్రామ ప్రజలు పట్టుకున్నారు. వారి వద్ద నుండి విగ్రహాలని స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసి పట్టు బడ్డ వారిలో ఒకడి పేరు దేవుడి చింటూ, మరొకరు సాయి కుమార్ గౌడ్ గా గ్రామ ప్రజలు తెలియజేశారు.

## గిరిజన గురుకులాల్లో 20 పార్ట్ టైమ్ పోస్టులు

- అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- బి.ఏ.ఎల్. నారాయణ నాయక్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

మహబూబాబాద్ రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బంది నియామకానికి అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ తోప్పో, ఐఏఎస్, ప్రాంతీయ సమన్వయ అధికారి (ఎఫ్ఏసీ) బి.ఏ.ఎల్. నారాయణ నాయక్ తెలిపారు. మొత్తం 20 పార్ట్‌టైమ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళల విభాగంలో 13 పోస్టులు ఉండగా, టీజీటీ విభాగంలో గణితం 2, ఫిజిక్స్ 1, బయోసైన్స్ 1, సోషల్ 2 పోస్టులు ఉన్నాయి. పీజీటీ విభాగంలో ఇంగ్లీష్ 2, ఫిజిక్స్ 2, జేఎల్ విభాగంలో కెమిస్ట్రీ 1, సివిక్స్ 1, డీఎల్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. జనరల్ విభాగంలో 7 పోస్టులు ఉన్నాయి. టీజీటీ విభాగంలో గణితం, ఫిజికల్ సైన్స్ ఒక్కొక్కటి, పీజీటీలో బయోసైన్స్ ఒకటి, జేఎల్‌లో గణితం, కామర్స్ ఒక్కొక్కటి, ఇతర విభాగంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పీడీ ఒక్కొక్క పోస్టు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో ఆగస్టు 14 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పని దినాల్లో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తులను మహబూబాబాద్‌లోని ఆర్‌డీసీ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్‌లో ఉన్న ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తారు. అభ్యర్థుల ఎంపిక డెమోలో సాధించిన మార్కుల ఆధారంగా మాత్రమే జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. డెమోను ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు టీ.జీ.టీ.డబ్ల్యూ.యూ.ఆర్.జే.సీ (బాలుర) మహబూబాబాద్‌లో, ఓల్డ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇందిరానగర్ కాలనీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా గురుకుల విద్యాలయాల్లోని పోస్టులకు మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఖాళీల సంఖ్యను పెంచడం, తగ్గించడం లేదా నియామక ప్రకటనను పూర్తిగా రద్దు చేసే అధికారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఉంటుందని అధికారులు వెల్లడించారు. నియామకానికి సంబంధించిన ఇతర వివరాల కోసం 7382931512, 7901099787 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**



**దేవరుప్పల, విశాల భారతి :**

మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీలో పలు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను డంపింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ రెవెన్యూ అధికారులను కోరారు. కాలనీలో అక్రమ ఇసుక రవాణా, డంపింగ్ జరుగుతున్న విషయాన్ని గ్రామస్థులు, రైతులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పలుమార్లు హెచ్చరించినప్పటికీ అక్రమ ఇసుక రవాణా, డంపింగ్ ఆగడం లేదని వారు తెలిపారు. దీంతో సర్పంచ్ స్వయంగా డంపింగ్ ప్రాంతాలను పరిశీలించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, గ్రామ పాలనాధికారి శ్రీధర్ అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ప్రాంతాల్లో భారీగా ఇసుక డంపింగ్ చేసినట్లు గుర్తించి సుమారు 150 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలించి డంపింగ్ చేస్తున్న దాదాసాహెబ్ కాలనీకి చెందిన ట్రాక్టర్ యజమానులపై వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ అశ్వక్ అహ్మద్‌కు సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఫిర్యాదు చేశారు.

## సాంకేతిక పరిజ్ఞానంతోనే రైతు ఆదాయం పెరుగుతుంది

- ఆత్మా చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి
- రైతుల సంపద పెంపే ప్రధాన లక్ష్యం



**విశాల భారతి, రాజన్న సిరిసిల్ల :** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసి, పంటల దిగుబడిని పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడమే ఆత్మా ప్రధాన లక్ష్యమని ఆత్మా వేములవాడ డివిజన్ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి తెలిపారు. వేములవాడ ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ATMA) వేములవాడ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటల దిగుబడిని పెంచుతూ పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త సాగు పద్ధతులు, సాంకేతిక విధానాలను రైతులు వినియోగించుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయంతో పాటు మత్స్య, పశుసంవర్ధక తదితర అనుబంధ రంగాల ద్వారా రైతులకు అదనపు ఆదాయ మార్గాలు చూపాలని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేసి వారి సంపదను పెంచే దిశగా ఆత్మా కమిటీ పనిచేస్తుందని ముకుందరెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారిణి సౌజన్య, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, ఆత్మా డైరెక్టర్లు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళనలు: ఉపాధ్యాయ సంఘాల




**మోతె, విశాలభారతి:** పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం. వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డిమాండ్లు పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళనలు చేపడుతామన్నారు. జూలై 1, 2023 నుండి నూతన వేతన సవరణను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పాఠశాలల మూసివేత ఆలోచనలను ఆపాలని, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 25ను సవరించి ప్రతి బడిలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను ఉంచాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు జిల్లా విద్యాశాఖాధికారి, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఉప విద్యాశాఖాధికారి, నూతన మండలాలకు మండల విద్యాశాఖాధికారి పోస్టులు మంజూరు చేయాలని, 398 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యాసంవత్సరంలో శిక్షణల పేరిట ఉపాధ్యాయులను తరగతులకు దూరం చేయవద్దని, వేసవి సెలవుల్లోనే శిక్షణలు పూర్తి చేసి, బోధనేతర పనులు చెప్పరాదని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల బాధ్యులు దామళ్ళ కోటేశ్వరరావు, వెంకటయ్య, డి.లాలు, సింహాద్రి, పరమేశు, నాగయ్య, నరేందర్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్, స్పోర్ట్స్ కిట్లు, షూల పంపిణీ



**దేవరుప్పుల విశాల భారతి ;** మండల కేంద్రంలోని దాదా సాహెబ్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శంకరాచార్య సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్స్, స్పోర్ట్స్ కిట్లు, షూలను పంపిణీ చేశారు.దాక్షాయిని జయంతి సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ హైదరాబాద్, దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ విద్యార్థులకు యూనిఫామ్స్, స్పోర్ట్స్ సామగ్రి, షూలను అందజేశారు .ఈ కార్యక్రమంలో కామారెడ్డిగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, స్థానిక పాఠశాల హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు శ్రావణి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గరుడ అవార్డు–2026లో గూడూరు బాలాజీకి ప్రథమ బహుమతి



**హన్మకొండ విశాల భారతి ;** తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర నాట్య కళ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గరుడ అవార్డు-2026 పౌరాణిక పద్య నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన 'రుద్రమదేవి' పద్య నాటకానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. "రుద్రమదేవి పద్య నాటకానికి ప్రథమ బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయానికి సహకరించిన నాటక బృంద సభ్యులకు, కళాభిమానులకు, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. పౌరాణిక పద్య నాటక కళను మరింతగా ప్రోత్సహిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మంచి ప్రదర్శనలు ఇవ్వడానికి కృషి చేస్తాను" అని తెలిపారు. పథమ బహుమతి అందుకున్న గూడూరు బాలాజీకి పలువురు కళాకారులు, అభిమానులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## దాదాసాహెబ్ కాలనీలో సీజ్ చేసిన 150 ట్రాక్టర్ల ఇసుకకు రేపు వేలం

**తహసిల్దార్ మహమ్మద్ అశ్వక్**

**దేవరుప్పుల విశాల భారతి ;** దాదాసాహెబ్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి సీజ్ చేసిన సుమారు 150 ట్రాక్టర్ల ఇసుకను 14/8/2026 శుక్రవారం ఉదయం 11:30 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ తెలిపారు.మండలంలో ఇసుక అవసరం ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ మహమ్మద్ అశ్వక్ సూచించారు. వేలానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## తట్టుపల్లిలో వెంకటమ్మ మృతి

**నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**



**కురవి విశాల భారతి):** కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐల బిక్షపతి తల్లి వెంకటమ్మ మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు వెంకటమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తట్టుపల్లి సర్పంచ్ భూక్య లీలా మంగిలాల్ నాయక్, తట్టుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు యాకన్న, సూదనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు గాండ్ల సతీష్, డోర్నకల్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొర్ని అనిల్, కురవి మండల నాయకులు చెన్నూరు వెంకన్న తదితరులు పాల్గొని వెంకటమ్మకు నివాళులర్పించారు.

## పాఠశాలకు రూ.లక్ష విలువైన సైన్స్ ల్యాబ్ సామగ్రి బహుకరణ




**సీరోల్ విశాల భారతి):** మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.లక్ష విలువైన సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన సామగ్రిని దాతలు బహుకరించారు. స్వాతంత్ర్య సమరయోధులు వెడవెల్లి వెంకట్ రెడ్డి కుమార్తె తునికి రాజా శ్రీ, ఆమె కుమార్తె కావేరి, మనవరాళ్లు మెహరా రెడ్డి, తనుశ్రీ రెడ్డిలు పాఠశాలకు సైన్స్ ల్యాబ్ సామగ్రిని అందజేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు ప్రయోగాత్మక విద్యకు ఈ సామగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనుమంతుల రమణ, వార్డు సభ్యుడు రమేష్, మాజీ ఉపసర్పంచ్ నాగేష్, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు గ్రామస్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్.రమణను కలిసిన పద్మశాలి సంఘం

**అధ్యక్షులు - మంద జగన్**

**సికింద్రాబాద్,, విశాలభారతి ;** మాజీ మంత్రి, బీసీ సంక్షేమ ఉద్యమ నేత ఎల్. రమణ ను గురువారం బౌద్ధనగర్ డివిజన్ మాజీ వార్డు మెంబర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, సికింద్రాబాద్ ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ రంగంలో మరింతగా ఎదగాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎల్. రమణ ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..ప్రజా సేవతో పాటు రాజకీయంగా మంచి గుర్తింపు సాధించాలని, నిబద్ధతతో ముందుకు సాగాలని ఎల్. రమణ ఇచ్చిన సూచనలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజు, చింతకింది మల్లేష్, గబ్బెట రాజు, కొండ కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

- రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ భవేష్ మిశ్రా
- డంపింగ్ యార్డు సందర్శన



**నిజామాబాద్, విశాలభారతి :** నిజామాబాద్‌ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

## హెచ్ఐవీ అనుమానితులను త్వరగా గుర్తించాలి

- 'దిశా' మాస సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి):** జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ, నివారణ చర్యలను మరింత పటిష్టంగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్ సూచించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో 'దిశా' మాస సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ అనుమానితులను, బాధితులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ యాంటీ రెట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టీ) చికిత్స అందేలా ఎంజీఎం ఆసుపత్రికి పంపించాలని సూచించారు. ఇప్పటికే ఏఆర్‌టీ మందులు వినియోగిస్తున్న వారందరికీ సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించేలా ఎంజీఎం ఆసుపత్రికి పంపించాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 959595 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. ఈ లక్ష్యాలను విజయవంతంగా చేరుకున్నప్పుడే మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రస్థాయిలో సురక్షిత జిల్లాగా నిలపగలమని పేర్కొన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్, దిశా సిబ్బంది, జిల్లా సహయోగి, ఐసీటీసీ కౌన్సిలర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కరుణామయిత్రి పాజిటివ్ పీపుల్ నెట్‌వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెనుక నుంచి కారు ఢీ

- మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్‌కు తృటిలో తప్పిన ప్రమాదం
- అబ్బాయిపాలెం శివారులో ఘటన.. కారు వెనుక భాగం ధ్వంసం
- ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్న అనుచరులు, గ్రామస్థులు



**మరిపెడ విశాల భారతి:**

మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులో గురువారం మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ప్రయాణిస్తున్న కారుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. రైస్‌మిల్లుకు వెళ్లే రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టడంతో వాహనం వెనుక భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికుల వివరాల ప్రకారం.. రెడ్యా నాయక్ ప్రయాణిస్తున్న కారు అబ్బాయిపాలెం శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లే రహదారిలో వెళ్తుండగా, ముందుగా వెళ్తున్న ఓ ద్విచక్రవాహనం ఒక్కసారిగా యూటర్న్ తీసుకుంది. అదే సమయంలో రహదారిపై ఎదురుగా కూలీలు వస్తుండటంతో వారిని తప్పించేందుకు రెడ్యా నాయక్ కారు డ్రైవర్ అప్రమత్తమై వాహన వేగాన్ని తగ్గించారు. అయితే వెనుక నుంచి అదే దిశలో వేగంగా వస్తున్న మరో కారు డ్రైవర్‌కు ముందున్న వాహనం నెమ్మదించడం గమనించేలోపే రెడ్యా నాయక్ కారును ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఢీకొన్న వేగానికి మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రమాద తీవ్రతను చూసిన స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

**ప్రమాద సమాచారం తెలిసి పరుగులు తీసిన గ్రామస్థులు.**

ప్రమాద సమాచారం క్షణాల్లో అబ్బాయిపాలెం, ధారావత్ తండా పరిసర ప్రాంతాలకు వ్యాపించింది. దీంతో గ్రామస్థులు, అనుచరులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ క్షేమంగా ఉండటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆయనను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఉపశమనం వ్యక్తం చేశారు. అయితే రహదారిపై వాహనాల రాకపోకలు, వేగ నియంత్రణపై మరోసారి చర్చకు దారితీసింది. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.


**తప్పిన పెను ముప్పు**

కారు వెనుక భాగం దెబ్బతిన్న తీరును పరిశీలించిన స్థానికులు ప్రమాద తీవ్రతను అంచనా వేసి, రెడ్యా నాయక్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడం అదృష్టంగా భావించారు. ద్విచక్రవాహనం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడం, ముందున్న వాహనం వేగం తగ్గించడం, వెనుక నుంచి మరో కారు వేగంగా రావడం వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, ప్రమాదానికి అసలు కారణాలు తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

## గురుకులాల్లో పార్ట్ టైమ్ బోధన సిబ్బంది నియామకం

**'అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి:**


పత్రికా ప్రకటన
తేదీ: 13-08-2026
TGT: గణితం -02 ఫిజిక్స్-01బయో సైన్స్-01 సోషల్ -02
PGT: ఇంగ్లీష్ 02, ఫిజిక్స్ -02
JL: కెమిస్ట్రీ -01 JLసివిక్స్- 01
DL: కంప్యూటర్ సైన్స్ -01
మొత్తం = 13
జనరల్:
ఆర్ట్ క్రాఫ్ట్ -01, PD -01
TGT గణితం 01, TGT ఫిజికల్ సైన్స్ - 01
PGT బయోసైన్స్ -01
JL గణితం-01 కామర్స్- 01
మొత్తం = 07
సంప్రదించవలసిన చరవాణి నెం. 7382931512, 7901099787
Regional Coordinator
TGTWREI SOCIETY
MAHABUBABAD REGION

మహబూబాబాద్ రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించేందుకు అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ తోప్పో, ఐఏఎస్, ప్రాంతీయ సమన్వయ అధికారి (ఎఫ్ఏసీ) బి.ఎ.ఎల్. నారాయణ నాయక్ తెలిపారు. మొత్తం 20 పార్ట్‌టైమ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళల విభాగంలో 13, జనరల్ విభాగంలో 7 పోస్టులు ఉన్నాయని తెలిపారు. మహిళల విభాగంలో టీజీటీ గణితం, ఫిజిక్స్, బయోసైన్స్, సోషల్; పీజీటీ ఇంగ్లీష్, ఫిజిక్స్; జేఎల్ కెమిస్ట్రీ, సివిక్స్; డీఎల్ కంప్యూటర్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ విభాగంలో టీజీటీ గణితం, ఫిజికల్ సైన్స్; పీజీటీ బయోసైన్స్; జేఎల్ గణితం, కామర్స్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పీడీ పోస్టులు ఉన్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో ఆగస్టు 14 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పని దినాల్లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఆర్డీసీ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, మహబూబాబాద్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థుల ఎంపిక డెమోలో సాధించిన మార్కుల ఆధారంగానే జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఆగస్టు 25వ తేదీ ఉదయం 10 గంటలకు టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ (బాలుర) మహబూబాబాద్‌లో డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ఓల్డ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇందిరానగర్ కాలనీలో ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యాలయాల్లోని ఖాళీలకు మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు. ఖాళీల సంఖ్యను పెంచడం, తగ్గించడం లేదా ప్రకటనను పూర్తిగా రద్దు చేసే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7382931512, 7901099787 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ఉచిత యూనిఫాంలు పంపిణి చేసిన జువ్వి నరసింహ సర్పంచ్**



**చౌటుప్పల్,విశాల భారతి:** విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ అన్నారు.చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణి కార్యక్రమం జరిగింది. ఏపీఎం యాదయ్యతో కలిసి సర్పంచ్ జువ్వి నర్సింహ్మ విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం కూడా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పకీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు సామిడి సంధ్య, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ, సీసీ మామిళ్ళ నర్సింహ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గూడూరు సునీత, వివోఏ సంతోష్, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొదట విలీనమే కావాలె

**తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య**



**ముషీరాబాద్,విశాల భారతి:** ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యూనియన్ల కంటే విలీనం కావాలని కార్మికులు కోరుకుంటున్నారని తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ ను మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలిసి బహుజన కార్మిక యూనియన్ నూతన కమిటీ లిస్టు, ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాజి రెడ్డి తో కలిసి మంత్రికి మెమోరాండం అందజేశారు. అనంతరం కత్తుల యాదయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులు విలీన ప్రకటన కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని వెంటనే ప్రక్రియ చేపట్టి అపాయింటెడ్ డే ను ప్రకటించాలని కోరారు. యూనియన్ ఎన్నికల నిర్వహణ పట్ల కార్మికులు విముఖంగా ఉన్నారని ఎన్నికల వలన ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి ఆర్టీసీకి ఎలాంటి లాభం లేదన్నారు. ఆర్టీసీకి నష్టదాయకం కలిగించే ఎన్నికలు వద్దని కార్మికుల మనోభావాలకు విరుద్ధంగా ఎన్నికలు ఎందుకు ఎవరి ప్రయోజనాల గురించి నిర్వహిస్తున్నారో అర్థం కాక కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కాకుండానే ప్రతి నెల అనేకమంది రిటైర్ అవుతున్నారని దీనితో విలీన లాభాలు అందకుండానే రిటైర్ అవుతున్నామని కార్మికులు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పద్ధతిలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

**కప్పపహాడ్ గ్రామ సర్పంచ్ బింగి గీతా రాములయ్య**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక చేయూతగా ఉండాలన్నదే తమ లక్ష్యమని కప్పపహాడ్ గ్రామ సర్పంచ్ బింగి గీత రాములయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 70మంది విద్యార్థులకు ప్రభుత్వం నుచి వచ్చిన ఒక్కోజత స్కూల్ యూనిఫామ్, షూస్ పాఠశాల హెచ్ ఎం సమక్షంలో అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బింగి గీత రాములాయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు పేదవర్గాలకు చెందిన వారి పిల్లలే విద్యను అభ్యసిస్తారని అలాంటి వారికి విద్యా సామాగ్రి అందించి ఆర్థిక చేయూతగా ఆదుకోవాలన్న లక్ష్యంతోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విడుతల వారిగా వివిద రకాల చేయూత కార్యక్రమాలను గ్రామ యూత్ ఆధ్వర్యంలో ద్వారా పలు సేవకార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మరికొద్ది రోజుల్లో విద్యార్థులకు నా వంతు గా స్టూడెంట్ గుర్తింపు కార్డులు, టై , బెల్టులు అందిస్తామని విద్యార్థులు చక్కగా చదువుకొని ప్రయోజకులుగా మారాలన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న యువత , ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించిన యువకులు పాఠశాలలో దత్తత తీసుకొని అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పలపు రమేష్, వార్డ్ సభ్యులు జంగలి శంకర్, అరుగే అలివేలు శ్రీశైలం,పాఠశాల హెచ్ ఎం ఆనందు,ఉపాధ్యాయులు కల్పనా, పారిజాత, తిరుపతియ్య,బేగం తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లుగా పెండింగ్లో ఉన్న స్టైపండ్ ను పెంచాలి

**ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టిన వైద్య విద్యార్థులు**

**ముషీరాబాద్,విశాల భారతి:** ఆయుష్ హౌస్ సర్జన్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు 10 ఏళ్లుగా స్టైఫండ్ పెంచకుండా అన్యాయం చేస్తున్నారని తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే స్టైఫండ్ ను పెంచి న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు.రాష్ట్రవ్యాప్తంగా భారీగా హాజరైన ఆయుష్ హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్స్ ను ఉద్దేశించి జేఏసీ అధ్యక్షులు రాజేష్ కళ్యాణ్ మాట్లాడారు. దేశంలో అతి తక్కువ స్టైఫండ్ పొందుతున్న తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు ఇతర రాష్ట్రాల లాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. బీహార్, యూపీలో లక్ష రూపాయలు ఉందని, పక్క రాష్ట్రము ఆంధ్రప్రదేశ్లో 60 వేలు ఇస్తున్నారని ఆ మాదిరిగా తెలంగాణలో ఇవ్వాలని కోరారు. ఇప్పటికే 10 సంవత్సరాలుగా అన్యాయం చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి స్టైఫండ్ పెంపుకు జీవోను విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయుష్ విభాగంలో హౌస్ సర్జన్స్, పేజీ విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపిడి ఐపిడి క్లినికల్ సేవలు పేషంట్ కేర్ ఎమర్జెన్సీ సేవలతో పాటు ఇతర వైద్య సేవలో నిరంతరం సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సాయి శ్రేయ, శ్రవణ్ బిరాజ్, రాజు, శ్యామ్, మహేష్, డాక్టర్ శ్రీధర్, జోష్న, ప్రేమానంద రావు, కిషన్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జావెలిన్ త్రోలో ధనుంజయ్ ప్రతిభ

- **42.90 మీటర్ల దూరం ఈటె విసిరి రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం..**
- **విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్,విశాల భారతి :** క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మండారి ధనుంజయ్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన 5వ జాతీయ జావెలిన్ డే వేడుకల అథ్లెటిక్స్ పోటీల్లో ధనుంజయ్ పాల్గొన్నారు. 16 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో జరిగిన జావెలిన్ త్రో పోటీలో 42.90 మీటర్ల దూరం ఈటెను విసిరి రాష్ట్రస్థాయిలో కాంస్య పతకాన్ని సాధించాడు. తన ప్రతిభతో బాటసింగారం గ్రామంతో పాటు పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చాడు.బాటసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి కాలనీలో సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరైన సందర్భంగా ధనుంజయ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించగలరని అన్నారు. ధనుంజయ్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ధనుంజయ్ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్, క్రీడా శిక్షకుడు డాక్టర్ సోలపోగుల స్వాములు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి, ఉపసర్పంచ్ నార్లకొండ వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు గడ్డం రమేష్ గౌడ్, నుజహత్ బేగం పాషా, వినోద్ గౌడ్, శ్యామల కృష్ణ గౌడ్, నిరుడి క్రాంతి కుమార్, కొండోజు సీతయ్య, కోడిశేలా నెహ్రూ, చెంచెల మమతసంజీవ్, రామసాని సుశీలకృష్ణారెడ్డి, కుతాడి శివ, పాస్తం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## అగ్రిసెట్ దరఖాస్తుల గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు



**రాజేంద్రనగర్, విశాల భారతి:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్-2026కు దరఖాస్తులు చేసుకునే గడువును ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. వ్యవసాయ డిప్లొమా, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులను పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అగ్రిసెట్ ద్వారా బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో, అగ్రి ఇంజనీరింగ్ సెట్ ద్వారా బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఉపకులపతి సూచించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ pjtau.edu.inలో పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు అండగా ఉంటా

- **10వేల రూపాయలు 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం**
- **బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో గత నాలుగు రోజుల కిందట మంత్రి నరసింహ అనారోగ్య సమస్యలతో మరణించారు.తల్లిదండ్రులను కోల్పోవడం వల్ల ముగ్గురు పిల్లలు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ద్వారా తెలుసుకొని గురువారం ఫౌండేషన్ చైర్మన్ మాజీ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి వారిని పరామర్శించి, ఆ చిన్నారులకు ధైర్యం చెప్పి నేనున్నానంటూ భరోసా ఇచ్చి 10వేల రూపాయలు, 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయంగా అందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బోసుపల్లి నందకుమార్ మాజీ ఉపసర్పంచ్ బూడిద నర్సింహారెడ్డి, ఎన్ను జయపాల్ రెడ్డి, బోసుపల్లి చంద్రశేఖర్, మడుపు గోపాల్, మంత్రి యాదయ్య, నరసింహ,రమేష్ శ్రీనివాస్,శ్రావణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బస్తీ బాటలో ప్రజలకు ఊరట.. ఐదు విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్



**రాజేంద్రనగర్, విశాల భారతి:** నార్సింగి బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా నార్సింగి హైట్స్‌లో ప్రజల సౌకర్యార్థం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపట్టారు. నార్సింగి హైట్స్‌లోని వరలక్ష్మి టిఫిన్ సెంటర్ నుంచి ముస్లిం శ్మశాన వాటిక వరకు రహదారికి ఇబ్బందికరంగా ఉన్న ఐదు విద్యుత్ స్తంభాలను విజయవంతంగా మరో ప్రాంతానికి తరలించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రహదారి విస్తరణతో పాటు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ స్తంభాలను షిఫ్ట్ చేయడం జరిగింది. ఈ పనులను వ్యవసాయ మార్కెట్ కమిటీ నార్సింగి చైర్మన్ కోట వేణు గౌడ్ పాల్గొని పరిశీలించారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మణికంఠ, లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాంట్రాక్టర్ శ్రీనాథ్, లైన్‌మెన్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులను పూర్తి చేశారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ పనికి స్థానికులు సహకరించడంతో కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.

## ఈటల రాజేందర్ నేతృత్వంలో కుత్బుల్లాపూర్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

- **వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు, యువత దేశభక్తిని చాటిన బీజేవైఎం**



**కుత్బుల్లాపూర్‌విశాల భారతి;** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఐడీపీఎల్ ఎక్స్‌రోడ్డు నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది విద్యార్థులు, యువత పాల్గొన్నారు.మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి.గిరి వర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత ప్రదర్శించిన ఉత్సాహం, క్రమశిక్షణ, దేశభక్తి అభినందనీయమన్నారు. దేశభక్తి గుండెల్లో నింపుకుని, తిరంగాను చేతబూని దేశ ప్రగతిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ర్యాలీని విజయవంతం చేసిన విద్యార్థులు, యువత, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## తెల్లాపూర్‌లో జోనల్ కమిషనర్ విస్తృత క్షేత్రస్థాయి తనిఖీలు

- **నీటి నిల్వ సమస్యల పరిష్కారానికి చర్యలు**
- **ప్రమాదాల నివారణకు మౌలిక వసతులు మెరుగుపర్చాలని ఆదేశం**



**శేరిలింగంపల్లి విశాల భారతి;** శేరిలింగంపల్లి జోన్ పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని తెల్లాపూర్ వార్డులో జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ గురువారం విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. స్థానిక పౌర, మౌలిక వసతుల సమస్యలను పరిశీలించి, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.నల్లగండ్ల రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో నీరు నిలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్, డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఆర్ఎమ్‌సీ ప్లాంట్ సమీపంలో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఊర్జిత్ విల్లాస్ వద్ద నీటి నిల్వ సమస్యను పరిశీలించిన ఆయన, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రాజపుష్ప రోడ్డులో ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి, ప్రమాదాల నివారణకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు పౌర సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని నారాయణ అమిత్ స్పష్టం చేశారు.

## శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

- **శ్రీరామ్‌నగర్‌లో ATMA–RPL శిక్షణ కార్యక్రమం**
- **నీటి పొదుపు, నేల ఆరోగ్యంపై రైతులకు సూచనలు**




**మొయినాబాద్ ఆగస్టు 13(విశాలభారతి):** మొయినాబాద్ మండలం శ్రీరామ్‌నగర్‌లో ATMA ఆధ్వర్యంలో RPL శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటల సాగు, సమగ్ర సస్యరక్షణ (IPM), సమగ్ర పోషక యాజమాన్యం (INM), నీటి యాజమాన్యం, మల్చింగ్, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా CRIDA, సంతోష్‌నగర్‌కు చెందిన డా. ఏ. గోపాలకృష్ణారెడ్డి, రైతు శిక్షణ కేంద్రానికి చెందిన రజియా, కిరణ్మయి రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులను వివరించారు. నేల పరీక్షల ప్రాధాన్యం, నేల ఆరోగ్య పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం, మల్చింగ్‌తో నేలలో తేమను కాపాడుకోవడం, సేంద్రియ పద్ధతులతో సాగు వ్యయాన్ని తగ్గించుకోవడంపై సూచనలు ఇచ్చారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. అనురాధ, AEOలు ఈ. దీనా, కె. శ్రీనివాస్, సర్పంచ్ మహిపాల్, ATMA సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

**బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్**



**సికింద్రాబాద్, విశాల భారతి :** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని బిఆర్ఎస్ నాయకులు సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, సికింద్రాబాద్ ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ తెలిపారు. గురువారం అంబానగర్ కట్ట ప్రాంతంలోని బెథానియా చర్చి సమీపం వద్ద డ్రైనేజీ లైన్ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోవడంతో వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మంద జగన్ అక్కడికి చేరుకుని దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా నిరంతరం అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. డ్రైనేజీ లైన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొండా కిషోర్, గబ్బెట రాజు, చింతకింది మల్లేష్ తదితరులున్నారు.

## గ్రీన్‌వుడ్ కాలనీ డ్రైనేజీకి పరిష్కారమెప్పుడో?



- **భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌కు కొత్త అంచనాలు**
- **పనులు వేగవంతం చేయాలని జలమండలి అధికారులకు కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచన**

**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :**

ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని గ్రీన్‌వుడ్ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మరోసారి చర్యలకు శ్రీకారం చుట్టారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు గురువారం జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటి పారుదల సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు కళ్లెం నవజీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించేందుకు గతంలోనే జలమండలి అధికారులతో చర్చించి భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించినప్పటికీ, డివిజన్ విభజన కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్యను ఇకపై ఆలస్యం చేయకుండా కొత్తగా అంచనాలు రూపొందించి, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని జలమండలి సిబ్బంది రాజేందర్‌కు కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని తెలిపారు. కాలనీ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గణేష్‌తో పాటు కాలనీవాసులు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 60 గజాల స్థలాలపై స్పష్టత ఇవ్వాలి

- **49 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదు**
- **పేదలు దళితుల సమస్యను పరిష్కరించాలి**
- **బీఆర్ఎస్ నేత కొంపల్లి అనంతరెడ్డి**

**మొయినాబాద్, ఆగస్టు 13(విశాలభారతి):**



పేదలు, దళితులు 60 గజాల ఇళ్ల స్థలాల కోసం 49 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి ఆరోపించారు. గురువారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 151లో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 290 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. ఇంతకాలం గడిచినా లబ్ధిదారులకు స్థలాలు అప్పగించకపోవడం బాధాకరమన్నారు. చేవెళ్ల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు పేదలు, దళితులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. స్థలాలు ఇవ్వడం సాధ్యమా? కాదా? అనే విషయాన్ని ప్రభుత్వం బాధితులకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. పేదలకు కేటాయించిన భూమిని మార్కెట్ యార్డు కోసం తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వ భూములను పేదల ఇళ్ల స్థలాల కోసం వినియోగించాలని సూచించారు. బాధితుల సమస్య పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని అనంతరెడ్డి డిమాండ్ చేశారు.

## కానిస్టేబుల్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి





- **సాయికుమార్ మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలను నివృత్తి చేయాలి : సీపీఐ నేతలు**

**అబ్దుల్లాపూర్ మెట్,విశాల భారతి :**

ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో విధుల్లో ఉండగా కానిస్టేబుల్ జర్పుల సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో కింది స్థాయి సిబ్బందిపై అధిక పని ఒత్తిడి ఉంటోందని, దీనికి తోడు కొంతమంది అధికారుల వేధింపులు కూడా ఉన్నాయనే ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న సాయికుమార్ చిన్న వయసులోనే విధుల్లో ఉండగా ఏసీపీ కార్యాలయంలో ఉరి వేసుకుని మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

**కుటుంబానికి న్యాయం చేయాలి**

సాయికుమార్ మృతికి దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో నిష్పక్షపాత విచారణ జరిపించాలని వారు కోరారు. విచారణ ద్వారా కుటుంబ సభ్యుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

**రూ.50 లక్షల పరిహారం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం**

మృతుడు సాయికుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి తగిన ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పోలీసు సిబ్బందిపై పని ఒత్తిడి, వేధింపులు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, కింది స్థాయి సిబ్బంది సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి కోరారు.

## మాజీ సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత కన్నుమూత



**శేరిలింగంపల్లి విశాల భారతి;** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా తెలంగాణ ఆవిర్భావం తర్వాత కూడా రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రాగం సుజాత నాగేందర్ యాదవ్ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు పరమపదించారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రాగం సుజాత మృతి వార్త తెలియగానే రాష్ట్ర రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర విషాదం అలముకుంది. బోర్డు చైర్‌పర్సన్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన ఆమె, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, మహిళా సాధికారతకు విశేషంగా కృషి చేశారు. ప్రజా జీవితంలో నిరంతరం అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను ముందుండి నడిపించారు. ఆమె మరణం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, భర్త రాగం నాగేందర్ యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఈ లోటును తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.కాగా, శుక్రవారం ఉదయం 10 గంటలకు శేరిలింగంపల్లి నుంచి ఆమె అంతిమయాత్ర ప్రారంభమవుతుందని, అనంతరం నల్లగండ్ల లోని స్వగ్రామంలో ఉన్న స్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## నార్సింగి హైట్స్‌లో డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి హైట్స్ కాలనీలో మెయింటెనెన్స్ వర్క్స్‌లో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పనుల పురోగతిని కాలనీ వాసులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తయితే మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని వారు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు నత్తనడకన సాగకుండా అవసరమైన సిబ్బంది, యంత్రాలను వినియోగించి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కోట వేణు గౌడ్, కుమార్ పేర్కొన్నారు. కాలనీ వాసులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి




**మరిపెడ విశాల భారతి:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సూచించారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండలంలోని గాలివారిగూడెం, ఎల్లంపేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని డాక్టర్ రవి తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.బీపీ, షుగర్ వంటి వ్యాధులు చిన్న వయసులోనే వస్తున్న నేపథ్యంలో సమతుల్య ఆహారం తీసుకుంటూ నిత్యం వ్యాయామం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు నారెడ్డి కవిత సుదర్శన్‌రెడ్డి, గండి రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు సతీష్, అమిత, బాల వికాస సంస్థ ప్రతినిధులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చిలకలగూడ పోలీసులు

**అనాథ వృద్ధుడికి అండగా నిలిచిన ఖాకీలు!**



**సికింద్రాబాద్,విశాల భారతి :** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ చిలకలగూడ పోలీసులు తమ ఉదారతను, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆప్యాయతకు దూరమై, చేతికి గాయంతో అల్లాడిపోతున్న ఓ వృద్ధుడికి అండగా నిలిచి సమాజంలో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచారు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన 70 ఏళ్ల కాళిదాస్ అనే వృద్ధుడి కుడిచేతికి తీవ్ర గాయమైంది. అతడిని చూసుకోవడానికి ఎవరూ లేక అవస్థలు పడుతుండగా గమనించిన చిలకలగూడ ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ మరియు ఎస్‌జీ రవీందర్‌లు తక్షణమే స్పందించారు. ముందుగా ఆ వృద్ధుడికి చేతికి అవసరమైన వైద్య చికిత్సను అందించారు. వృద్ధుడు దుస్తులు కూడా బాగా పాడైపోవడంతో పోలీసులు దగ్గరుండి కొత్త దుస్తులు కొనిచ్చి, అతడికి ధరింపజేశారు. అనంతరం ఆయన కోరిక మేరకు సురక్షితంగా బోయిగూడలోని మదర్ థెరిసా హోమ్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. సమయానుకూలంగా స్పందించి వృద్ధుడికి సాయం అందించిన పోలీసు అధికారుల ఉదారతను స్థానికులు విశేషంగా కొనియాడుతున్నారు.

## యాచారం మండల వార్డు మెంబర్ల నూతన అధ్యక్షులుగా తలారి సత్యనారాయణ



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** యాచారం మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్ లో జరిగిన వార్డు మెంబర్ల కమిటీ సమావేశాన్ని గురువారం వార్డ్ మెంబర్ల రంగారెడ్డి జిల్లా పోరం ఇన్చార్జి గ్యార సురేష్ ఆధ్వర్యంలో యాచారం మండల వార్డు మెంబర్ల నూతన అధ్యక్షునిగా ఎన్నికైన తలారి సత్యనారాయణ.. ఉపాధ్యక్షులుగా యూసఫ్ , మహేష్ జగదీష్ సాయికుమార్, జగదీష్, సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ s.ప్రవీణ్, ప్రవీణ్ ప్రధాన కార్యదర్శులుగా బొల్లంపల్లి వెంకటేష్ కాటిక శంకర్, వరలక్ష్మి తులసి కుమార్, మక్కపల్లి మహేష్, మారవని నవ్య, గౌరవ అధ్యక్షులు కొండాపురం సుష్మ, శ్రీశైలం,దశరథ, అంజయ్య. ఈ సందర్భంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, ఇతర పదవులు పొందిన వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించినందుకు నూతన కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో వార్డు మెంబర్లకు సంబంధించిన ఏ విధమైన సమస్యలు వచ్చిన అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## జరుపుల సాయికుమార్ కు పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుంది

**ఇబ్రహీంపట్నం ఏసిపి కె పి వి రాజు**

**సాయికుమార్ పాడేను మోసిన ఏసిపి కేపివి రాజు సీఐ మధు ఎస్సై వంశి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** ఎల్‌బి నగర్ ఏసిపి ఆఫీసు లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జరుపుల సాయికుమార్ నిన్న మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన అజ్ఞాన తండా, బండలేమూరు గ్రామం, మంచాల మండలం, రంగారెడ్డి జిల్లాలో గురువారం పోలీసు అధికారుల ఆధ్వర్యంలోఅంత్యక్రియలు నిర్వహించారు.ఇబ్రహీంపట్నం ఏసీపీ కెవిపి రాజు ఆధ్వర్యంలో, మంచాల పోలీస్ స్టేషన్ సీఐ మధు, ఎస్ఐ వంశీ పోలీసు అధికారులు, సిబ్బంది సాయికుమార్ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాయికుమార్ పాడెను మొదటి నుంచి చివరి వరకు స్వయంగా మోసి గౌరవపూర్వకంగా తుది వీడుకోలు పలికారు. సాయికుమార్ అంత్యక్రియలకు వచ్చిన గ్రామ ప్రజలకు బంధువులకు మంచాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ మృతులు జరపుల సాయికుమార్ కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్ శాఖ ముందంజ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జైత్రామ్'కు మెరుగైన వైద్యం అందించాలి

- **బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని**
- **ఖమ్మంలో కార్పొరేషన్ కార్మికుడిని పరామర్శించిన ఎమ్మెల్యే**



**పాల్వంచ విశాల భారతి:** విద్యుత్ దీపాలు అమర్చుతూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన మున్సిపల్ మల్టీ పర్పస్ కార్మికుడు భూక్యా జైత్రామ్ కు ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వైద్యులను ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంగపేట 23వ డివిజన్‌కు చెందిన మున్సిపల్ కార్మికుడు భూక్యా జైత్రామ్ విద్యుత్ స్తంభంపై దీపం ఏర్పాటు చేస్తుండగా జారి కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. బాధితుడిని మొదట కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని మమత జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ఆస్పత్రికి వెళ్ళి చికిత్స పొందుతున్న జైత్రామ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నందున ప్రాణాపాయం తప్పించేలా నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదానికి గురైన కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన త్వరగా కోలుకోవాలని కూనంనేని ఆకాంక్షించారు.

## మాల్ లైఫ్ స్టార్ హాస్పిటల్‌లో మోకాళ్ళమార్పిడికి అత్యాధునిక శాస్త్ర చికిత్స

**పెద్ద శాస్త్ర చికిత్సలకు హైదరాబాదు వెళ్లే అవసరం లేదు : మేనేజింగ్ డైరెక్టర్ పి వినోద్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** మాల్ మండల కేంద్రంలోని మాల్ మార్కెట్ లో లైఫ్ స్టార్ హాస్పిటల్ లో మోకాళ్ళ మార్పిడికి అత్యాధునిక శస్త్ర చికిత్స చేసిన డాక్టర్ రమేష్ ఆర్తో సర్జన్ వైద్యబృందం కలసి పూర్తి చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ పి వినోద్ మాట్లాడుతూ మోకాళ్ళ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి, మోకాళ్ళ మార్పిడికి సర్జరీ తర్వాత పేషెంట్లు స్వయంగా వారే నడుస్తున్నారని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ శస్త్ర చికిత్సలకు హైదరాబాదుకు వెళ్లకుండా కార్పొరేటు ఆసుపత్రులకు దీటుగా పేద మధ్య తరగతి ప్రజలకు తక్కువ రేట్లతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని, మాల్ పరిసర ప్రాంతాలలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# అభివృద్ధికి రూ.4.25 కోట్లు.. మల్‌రెడ్డి దూకుడు

- **మండలవ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం..**
- **రెండున్నరేళ్లలో మౌలిక వసతులకు రూ.700 కోట్లకుపైగా తెచ్చా: ఎమ్మెల్యే**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించిన ఆయన హెచ్ఎండీఏ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రూ.4.25 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

**పల్లెల్లో అభివృద్ధి పనుల పరంపర**

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.50 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ప్రారంభించారు. అనంతరం కవాడిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. బండరావిరాలలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. చిన్నరావిరాలలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించడంతో పాటు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇనాంగూడలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

పిగ్లీపూర్‌లో రూ.25 లక్షలు, బాటసింగారంలో రూ.75 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మజీద్‌పూర్‌లో రూ.25 లక్షలు, గుంతపల్లిలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. లష్కర్‌గూడలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గండిచెరువులో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు మరో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

**" ఇబ్రహీంపట్నానికి అభివృద్ధిలో అగ్రస్థానం"**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిధుల మంజూరు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. రెండున్నరేళ్లలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.700 కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. 15 ఏళ్లుగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారు కనీసం రూ.7 కోట్ల నిధులైనా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. తాను తీసుకొచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అభివృద్ధి జరిగితే ప్రోత్సహించాలే తప్ప రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు.

**"కబ్జాదారులను ప్రజలే తరిమికొట్టాలి"***

గత పాలకులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అధికారం అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడినవారే ఇప్పుడు కబ్జాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ప్రభుత్వ భూముల వ్యవహారాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దొంగలతో దోస్తీ చేస్తూ తండ్రీకొడుకులు ప్రజల వద్దకు వెళ్లి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించిన ఎమ్మెల్యే, కబ్జాదారులు, భూదందాలకు పాల్పడే వారిని గ్రామాల నుంచి ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. గత పాలనలో అభివృద్ధికి దూరమైన గ్రామాలను ప్రస్తుత ప్రభుత్వం తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువస్తోందన్నారు.

**ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే అభినందనలు**

పర్యటనలో భాగంగా పిగ్లీపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు పూర్తిచేసుకున్న కుటుంబం గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. నూతన గృహానికి రిబ్బన్ కట్ చేసి కుటుంబ సభ్యులను అభినందించారు. దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. తమ సొంతింటి కల నెరవేరిన ఆనందంతో ఉన్న కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే స్వయంగా గృహప్రవేశానికి రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తయిన గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , వైస్ చైర్మన్ భాస్కరాచారి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, కవాడి పల్లి సర్పంచ్ కొలను లక్ష్మీ ప్రసన్న రవీందర్ రెడ్డి, బండ రావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, చిన్నరావిర్యాల సర్పంచ్ పద్ధతి బాలకిషన్ గౌడ్, ఫిగ్లీపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, బాటసింగారం సర్పంచ్ గౌరీ శంకర్, ఇనాం గూడా సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, మజీద్పూర్ సర్పంచ్ ప్రియా చంద్రశేఖర్, గుంతపల్లి సర్పంచ్ అంతటి హేమలత జంగయ్య గౌడ్, లష్కర్ గూడా సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, , గండి చెరువు సర్పంచ్ రవీందర్ రెడ్డి,మాజీ ప్రజాప్రతినిధులు బుర్ర రేఖ మహేందర్ గౌడ్, కొత్త ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న రావిరాల అభివృద్ధికి 'రంగారెడ్డి' బాట



- **ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..**
- **సీసీ రోడ్ల ప్రారంభం..**
  **కొత్త రోడ్లకు శంకుస్థాపన**

**అబ్దుల్లాపూర్‌మెట్ , విశాల భారతి :**

చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు మౌలిక వసతులను మరింత చేరువ చేశారు. మహిళా సంఘం కార్యక్రమంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, పూర్తయిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.

**పేదల సొంతింటి కలకు భరోసా**

ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. నూతన గృహాల్లో గృహప్రవేశాలు నిర్వహించడం సంతోషకరమైన విషయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

**గ్రామీణ రహదారులకు ప్రాధాన్యం**

చిన్నరావిరాల గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, మరోవైపు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామంలోని మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం**

మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలకు ఆర్థికంగా స్వావలంబన కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, మల్లేష్, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, నారెడ్డి రిషిత, సతీష్‌రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, కళ్లెం లింగారెడ్డి, చింతల సురేందర్‌రెడ్డి, కడవేరు శ్రీనివాసరావుతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అన్ని కేసులకు ఒకే టైమ్ సాధ్యం కాదు

**ఢిల్లీ, విశాల భారతి:**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కోర్టులు, కాల పరిమితితో కూడిన విచారణలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రకాల కేసులకు ఒకే కాలపరిమితిని నిర్ణయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేసుల స్వభావాన్ని బట్టి తగిన సమయాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక అంశాలపై మాట్లాడారు. దేశంలోని న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ కొనసాగుతుండటం పెద్ద సవాలేనని సీజేఐ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి జిల్లా, సెషన్స్ కోర్టుల వరకు ఈ సమస్య ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రతి కేసు నిర్ణీత సమయంలో త్వరగా పరిష్కారం కావాలన్న ప్రజల ఆకాంక్ష సమంజసమేనని చెప్పారు. అయితే ప్రతి కేసుకు ఒకే కాలపరిమితిని వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. కేసుల స్వభావం, సంక్లిష్టత, అంశాల ఆధారంగా విచారణకు అవసరమైన సమయం మారుతుందని వివరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ఆధారంగా కేసులకు తగిన కాలపరిమితులను నిర్ణయిస్తామని తెలిపారు. కేసుల పరిష్కారంలో ప్రత్యేక కోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీజేఐ అన్నారు. ప్రభుత్వ సహకారంతో తీవ్రమైన నేరాలకు సంబంధించిన విచారణల కోసం ఏడాది వ్యవధిలోనే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. వివాహ, కుటుంబ వివాదాల కోసం ఫ్యామిలీ కోర్టులు, వాణిజ్య వివాదాల కోసం కమర్షియల్ కోర్టులు, వివిధ అంశాలపై ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకే రకమైన కేసులను ఆయా అంశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయస్థానాలు విచారిస్తే వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భిన్న రకాల కేసులను ఆయా రంగాల్లో నిపుణత కలిగిన కోర్టులు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేసుల పెండింగ్‌ను పూర్తిగా తగ్గించడంలో న్యాయ వ్యవస్థ ఇంకా పూర్తి విజయం సాధించలేదని సీజేఐ అంగీకరించారు. న్యాయమూర్తుల నియామకాలు, ముఖ్యంగా జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వంటి అంశాలు దీనికి కారణమని చెప్పారు. తాను సీజేఐగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కేసుల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే 'డాకెట్ మేనేజ్‌మెంట్'పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా భారీ ప్రభావం చూపే, అత్యంత కీలకమైన కేసులను ముందుగా పరిష్కరించే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు, ఒకే తరహా కేసులను సమూహాలుగా విచారించడం ద్వారా పెండింగ్‌ను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. న్యాయ వ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నప్పటికీ అది న్యాయమూర్తి స్థానాన్ని భర్తీ చేయకూడదని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయాధికారులు యాంత్రికంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదన్నారు. టెక్నాలజీని న్యాయమూర్తికి సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి తప్ప సాంకేతికతే తీర్పు చెప్పే స్థాయికి వెళ్లకూడదని పేర్కొన్నారు. రాష్ట్రాలు లేదా నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే విధానంపైనా సీజేఐ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రభావం చూపే అంశాలను సుప్రీంకోర్టు విచారించవచ్చని కానీ ఒక రాష్ట్రం లేదా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన అంశాలను ముందుగా సంబంధిత హైకోర్టు ముందు ఉంచాలని సూచించారు. భారత రాజ్యాంగంలో హైకోర్టులకు అత్యంత కీలకమైన స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు రాజ్యాంగపరమైన అధికారాలు ఉన్నాయని వివరించారు. కొన్ని అంశాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు ఉన్న అధికార పరిధి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు ఉన్న పరిధి కంటే విస్తృతంగా ఉంటుందని చెప్పారు.

## 2.5 కిలోల గంజాయి స్వాధీనం ఇద్దరు నిందితుల అరెస్ట్

**హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ సిఐ సత్యనారాయణ**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మిరఖాన్పేట్ గ్రామ శివారులోని విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్లమ్మ దేవాలయం వద్ద గురువారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఎస్ ఐ లు డి సునీల్ కుమార్, జి సైదులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో అనుమానాస్పదంగా నల్లరంగు బ్యాగ్‌తో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద 2.5 కిలోల గంజాయి లభించింది. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా విక్రయించేందుకు ఉపయోగించే 50 చిన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితులు గంజాయిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న ఇతర వ్యక్తుల వివరాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ , 1985 సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితులను చట్టపరమైన తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరచడం జరుగుతుందని అన్నారు.

## విద్యుత్ సమస్యలపై అధికారుల ప్రత్యేక దృష్టి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ సర్కిల్ 123వ డివిజన్ పరిధిలోని హైదర్షాకోట్ విద్యానగర్ ఫేజ్1, ఫేజ్2లో గురువారం విద్యుత్ బస్తీ బాట స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలనీలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, నాయకుడు హరీష్ గౌడ్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు ఏఈ తెలిపారు. సమస్యను పరిశీలించిన అనంతరం అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సరఫరాను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం లేకుండా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతామని ఏఈ రమేష్ హామీ ఇచ్చారు. కాలనీల్లో పాత, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ లైన్లను కూడా పరిశీలిస్తామని తెలిపారు. విద్యుత్ భద్రత విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని కాలనీ వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దస్తగిరి, రాములు, రాజు యాదవ్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

## రేగులకుంట ప్రభుత్వ భూమిని కాపాడాలి

- **సర్వే నంబర్ 151లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**
- **నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని 'జనం కోసం' డిమాండ్**



**శేరిలింగంపల్లి విశాల భారతి;** శేరిలింగంపల్లి పరిధిలోని హఫీజ్ పేట్ రేగులకుంటలో ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని 'జనం కోసం' సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. రేగులకుంటలోని సర్వే నంబర్ 151లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు కసిరెడ్డి భాస్కరరెడ్డి శేరిలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 151కు సంబంధించి తహసీల్దార్, ఆర్డీవో, ఏడీ స్థాయి అధికారులు గతంలో ఇచ్చిన నివేదికల్లో ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా స్పష్టంగా పేర్కొన్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూమిగా అధికారుల నివేదికల్లో తేలినప్పటికీ అక్కడ నిర్మాణాలు కొనసాగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉన్నప్పటికీ నిర్మాణాలు జరుగుతున్న సమయంలో అధికారులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన హద్దులను నిర్ధారించి, ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 151లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులతో పాటు వారికి సహకరించిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కసిరెడ్డి భాస్కరరెడ్డి కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా నిర్మాణ అనుమతులు జారీ చేసి ఉంటే వాటిని పరిశీలించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**తక్షణ చర్యలు తీసుకుంటాం...**

కసిరెడ్డి భాస్కరరెడ్డి సమర్పించిన వినతిపత్రంపై తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ భూమి పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్వే నంబర్ 151లో నిర్మాణాలకు సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అనుమతులను రద్దు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# టీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల చేరిక

- శేరిలింగంపల్లిలో 30 మంది కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్



**శేరిలింగంపల్లి విశాల భారతి;** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో టీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి.నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి సురేష్ శంకరోళ్ల నేతృత్వంలో సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. మియాపూర్, కొండాపూర్ డివిజన్లకు చెందిన వీరు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఈ మేరకు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని, కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల నుంచి టీఆర్ఎస్‌కు విశేష మద్దతు లభిస్తోందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో జరిగే ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని అన్నారు. కార్యక్రమంలో సురేష్,మధు కిరణ్, నరేంద్ర రెడ్డి, రాణి, పార్వతమ్మ, వరమ్మ, సరోజ, అంజమ్మ, భూదేవి, దిలీప్, వెంకటేష్, మహేష్, మధుబాబు తదితరులు టీఆర్ఎస్‌లో చేరారు.పార్టీ నాయకులు కిషోర్, లావణ్య బండారి, విష్ణు, దయానంద్ గుండె, మురుగేసన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్

**పిల్లలు, పెద్దలకు ప్రకృతితో మమేకమయ్యే అవకాశం**



**రాజేంద్రనగర్, విశాల భారతి:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (TGFDC) ఆధ్వర్యంలో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి 16వ తేదీ ఉదయం 10 గంటల వరకు ప్రత్యేక నేచర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సీనియర్ డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం శిరీష తెలిపారు. నేచర్ క్యాంప్‌లో భాగంగా టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, నోక్టర్నల్ వాక్, నైట్ క్యాంపింగ్, ఉదయం బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలను నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. క్యాంప్‌లో పాల్గొనే వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం అల్పాహారం అందించనున్నారు. పిల్లలు, పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా బర్డ్ వాచింగ్ ద్వారా వివిధ రకాల పక్షులను గుర్తించడం, అవి ఎలాంటి వాతావరణంలో, ఎలాంటి వృక్షాల్లో గూళ్లు నిర్మించుకుంటాయో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. పక్షుల ఆహారపు అలవాట్లు, ఎగిరే విధానం, సామాజిక ప్రవర్తన తదితర అంశాలను నేచరలిస్టులు ప్రత్యక్షంగా పక్షులను చూపిస్తూ వివరించనున్నారు. 6 నుంచి 12 సంవత్సరాల పిల్లలకు ఒక్కొక్కరికి రూ.1,199, 13 సంవత్సరాలు పైబడిన వారికి ఒక్కొక్కరికి రూ.1,999గా రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. నేచర్ క్యాంప్‌లో పాల్గొనదలచిన వారు www.deccanwoodsandtrails.com వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 94935 49399, 98852 98980, 92475 86287 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# నిత్యావసర ధరలు తగ్గించడంలో కేంద్రం విఫలం

- రాష్ట్ర విభజన హామీల అమలులోనూ బీజేపీ ప్రభుత్వం విఫలం
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి

**మరిపెడ విశాల భారతి:** నిత్యావసర వస్తువుల ధరలను వంద రోజుల్లో తగ్గిస్తామని హామీలు ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి విమర్శించారు. రైతులకు పంటలకు తగిన మద్దతు ధర కల్పించకపోవడంతో పాటు, అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మరిపెడ మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన అన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, తెలంగాణకు జాతీయ ప్రాజెక్టు హోదా, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు వంటి హామీలను నెరవేర్చకపోవడం కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "మార్పు కావాలి" అనే నినాదంతో సీపీఐ చేపట్టిన సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# చిన్నమడూరులో పడావు పడిన 300 ఎకరాల పంట పొలాలు

- సాగునీరు లేక వరి నాట్లు వేయని రైతులు.. మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆవేదన
- దేవాదుల రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలని రైతుల విజ్ఞప్తి

**దేవరుప్పల విశాల భారతి**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమదూరు గ్రామం నుంచి రాంబోజిగూడెం వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మార్గమధ్యలో గోపి చెరువు ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలను పరిశీలించారు. చెరువులో నీరు లేక సుమారు 300 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు చేయకుండా పొలాలు పడావుగా ఉండటాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వ్యవసాయమే తమకు ప్రధాన ఆధారమని, దేవాదుల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువును నింపి తమను ఆదుకోవాలని ఎర్రబెల్లిని కోరారు.అనంతరం ఎండిపోయిన వాగును, సాగు చేయకుండా ఖాళీగా ఉన్న పొలాలను పరిశీలించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం రిజర్వాయర్లను నింపి, గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులపై ఉన్న చెక్‌డ్యామ్‌లను నీటితో నింపేవాళ్లమని అన్నారు. సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆరోపించారు.సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఎర్రబెల్లి హెచ్చరించారు. కార్యక్రమంలో పల్లా సుందర్ రామిరెడ్డి,ఉప సర్పంచ్ ముషిగంపుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రంగా అర్జున్, ముసిగంపుల కృష్ణమూర్తి, మేడ సోమ నరసయ్య,దేవరుప్పుల మండల బీఆర్ఎస్ నాయకులు, చిన్నమదూరు, రాంబోజిగూడెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# లియాఖత్ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

**ప్రజా హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు కొనసాగించాలి: నల్లు సుధాకర్ రెడ్డి**

**కురవి, విశాల భారతి ):** ప్రజల హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన అమరజీవి లియాఖత్ అలీ స్ఫూర్తితో పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో అమరజీవి లియాఖత్ అలీ 22వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నల్లు సుధాకర్ రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరు. శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తాను నమ్మిన ఆశయం కోసం చివరి వరకు పోరాడిన లియాఖత్ అలీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనా విధానం, ఆశయాలు, ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ ముందుకు నడిపిస్తాయని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ హక్కుల సాధన కోసం పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్, సీపీఐ కురవి గ్రామ కార్యదర్శి తురక రమేష్, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లియాఖత్ అలీ మిత్రులు పాల్గొన్నారు.



# విద్యార్థి, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి



**రామకృష్ణ యాదవ్**

**మునగాల, విశాల భారతి:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8,500 కోట్ల రూపాయల విద్యానిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మునగాలలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడలో విద్యార్థులు, నిరుద్యోగుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో నేడు విద్యానిధులు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహాల విద్యార్థుల భోజన, నిత్యవసరాల ఖర్చుల భత్యాన్ని పెంచి, సొంత భవనాలు నిర్మించాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, నియోజకవర్గానికి ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సతీష్, నరేష్, మహేష్, నాగరాజు, రాంబాబు, వినయ్, ప్రదీప్, శీను పాల్గొన్నారు.

# చెత్త డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలి

- అంకిరెడ్డి గూడెం గ్రామ ప్రజల సమిష్టి నిర్ణయం
- సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్డీవో,ఎంఆర్ఓ,ఎంపిఓ కు వినతి



**చౌటుప్పల్,విశాల భారతి:** పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంకిరెడ్డిగూడెం గ్రామ ప్రజలు సమిష్టిగా ముందడుగు వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం రెవిన్యూ పరిధి, అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలోని సర్వే నెం. 326లో స్మశాన వాటిక ప్రక్కన, కాంశెట్టి పెంటయ్య బావి నుండి బిస్కెట్ల కంపెనీ వెనుక భాగం వరకు ఉన్న కట్ట స్థలంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల చెత్తను నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, జనావాసాలకు మరియు పాఠశాలలకు కనీసం 2 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ ను తరలించాలని కోరుతూ,అధికారులైనా ఆర్డిఓ వి. శేఖర్ రెడ్డి,ఎంఆర్ఓ వీరాబాయి, ఎంపిఓ కె. శ్రీలత లను కలిసి, ఆ గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో దొడ్ల అండాలుశెట్టయ్య గౌడ్, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, పర్నే శ్రీధర్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, గంగాపురం పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం ముందుండి నిలిచిన సర్పంచ్ మరియు గ్రామ పెద్దల చొరవ స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. సమస్యను సానుకూలంగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేస్తారని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మత్స్య కార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్ష నిర్వహణ

- వల విసరడం, పాండి గుంజడం.. వల అల్లడం తెప్ప మీద నీళ్లపై వెళ్లడం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** ఇబ్రహీంపట్నం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద మత్స్య కార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్ష గురువారం నిర్వహించచారు. రంగారెడ్డి జిల్లా మత్స్య శాఖ ఏడి వెంకయ్య, డి ఎఫ్ ఓ వెంకటేష్, డీఎఫ్ఓ కోపరేటివ్ అధికారి రవికుమార్ ల పర్యవేక్షణలో 94 మంది మత్స్య కార్మికులకు వల విసరడం, ఈత కొట్టడం, పాండి గుంజడం, తెప్ప మీద నీళ్లపై వెళ్లడం, వల అల్లడం వంటి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ నైపుణ్య పరీక్షలో నూతన సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్ని విధాల అర్హులైన సభ్యులు ప్రభుత్వం నుండి మత్స్యకారులకు లభించే అన్ని పథకాలకు అర్హులుగా గుర్తింపు పొందుతారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మత్స్యకార అధ్యక్షులు దూస వెంకటేష్, ఇబ్రహీంపట్నం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జెర్కొని బాలరాజ్, ఇబ్రహీంపట్నం ఎఫ్.సి.ఎస్ మాజీ అధ్యక్షులు దివిటి రాములు, రంగారెడ్డి జిల్లా మత్స్యకార మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు చెనమోని శంకర్, మాజీ అధ్యక్షులు బోళ్ల సీతయ్య, ముదిరాజ్ సంఘం, గంగపుత్ర సంఘం నాయకులు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీయింబర్స్ మెంట్ ఫీజుల విడుదల కోసం కదం తొక్కిన ఎస్ఎఫ్ఐ

- పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి
- మహబూబాబాద్ కలెక్టరేట్ ముట్టడి.. గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించిన విద్యార్థులు.
- విద్యార్థులు–పోలీసుల మధ్య తోపులాటతో ఉద్రిక్తత

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** రాష్ట్రవ్యాప్తంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) కదం తొక్కింది. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వందలాది మంది విద్యార్థులతో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ల వద్దకు భారీగా చేరుకున్న విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు కలెక్టరేట్ గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుని కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతి, కార్యదర్శి బసు పట్ల మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగంలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయడం ద్వారా ప్రభుత్వం వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విద్యాశాఖ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు అవసరమైన భవనాలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లాకు మంజూరైన రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రభుత్వం, అధికారులు స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ప్రశ్నించే విద్యార్థుల గొంతులను అణచివేయడం కాకుండా, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా మొద్దు నిద్ర వీడి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. లేని పక్షంలో విద్యార్థులను మరింత పెద్ద ఎత్తున సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ సింహాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ అమీర్, గుండ్ల రాకేష్, జిల్లా నాయకులు కోల్పాక వీరేందర్, పెద్దపులి బాసు, వంశీ, గణేష్, చందు, అఖిల, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల ట్రాక్టర్లే టార్గెట్..!

- పట్టుకుంటారు.. కేసులు పెడతారు.. మళ్లీ వదిలేస్తారా?
- రూ.5 వేల వసూళ్ల ఆరోపణలు
- వైరల్ ఆడియోల కలకలం
- రెవెన్యూ అధికారుల తీరుపై మండలంలో తీవ్ర ఆగ్రహం
- ఉన్నతాధికారుల సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

**చిన్నగూడూర్ విశాల భారతి:**



చిన్నగూడూరు మండలంలో ఇసుక తరలింపు వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ అధికారుల తీరుపైనే తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తోంది. నిబంధనలు సామాన్యులకేనా..? పలుకుబడి ఉన్నవారికి వర్తించవా..? అన్న ప్రశ్నలు మండల ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఆకేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడం.. పోలీస్‌స్టేషన్‌కు తరలించడం.. కొన్ని వాహనాలపై కేసులు పెట్టడం.. మరికొన్ని వాహనాలను మాత్రం వదిలేయడం వెనుక అసలు కథ ఏమిటన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే 'పట్టుకుంటారు.. వదిలేస్తారు..' అన్న ఆరోపణలు అధికారుల పనితీరుపై నేరుగా వేలెత్తి చూపుతున్నాయి. తాజాగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అదే సమయంలో మరో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నప్పటికీ గ్రామానికి చేరుకున్న తర్వాత వదిలేశారనే ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. వాహనాలను పట్టుకున్నది నిజమైతే.. అవి అధికారుల కళ్ల ముందే ఎలా తప్పించుకున్నాయి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**సామాన్యుడి ట్రాక్టర్ అయితే నిబంధనలు..?**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఇసుక అవసరం. ఈ అవసరాల కోసం ఇసుక తరలించే సామాన్యుల ట్రాక్టర్లపై నిబంధనల పేరుతో చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే అదే సమయంలో రాజకీయ పలుకుబడి ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న కొన్ని ట్రాక్టర్ల విషయంలో మాత్రం అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం అందరికీ ఒకటే అయితే.. చర్యలు కూడా అందరికీ ఒకేలా ఉండాలి. ఒకరి ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు పెడుతూ.. మరొకరి ట్రాక్టర్‌ను వదిలేస్తే అధికారుల తీరుపై అనుమానాలు రావడం సహజమేనని ప్రజలు అంటున్నారు.

**పట్టుకున్న ట్రాక్టర్లు ఎలా తప్పించుకున్నాయి?**

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఇదే. అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు వారి పర్యవేక్షణలో ఉన్నప్పటికీ ఎలా తప్పించుకున్నాయి? వాహనాలను ఎవరు అడ్డుకోవాలి? పోలీసులకు అప్పగించే వరకు బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. అధికారులు పట్టుకున్నప్పటికీ తమ నుంచి తప్పించుకుని వెళ్లి ఇసుకను అన్‌లోడ్ చేసుకున్నాయని చెప్పినట్లు సమాచారం. 'పట్టుకున్నాం.. కానీ తప్పించుకున్నారు' అనే సమాధానం ప్రజలకు ఎంతవరకు ఆమోదయోగ్యం? అధికారులు నిజంగా పట్టుకున్నట్లయితే వాహనాలను ఎందుకు కాపాడలేకపోయారు? అనే ప్రశ్నలకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రూ.5 వేల డిమాండ్.. ఆడియోలతో కలకలం.**

ఇక రెవెన్యూ కార్యాలయంలో ట్రాక్టర్ విడుదల ఉత్తర్వులు, ఇతర ఫైళ్ల విషయంలో సామాన్యుల నుంచి 'ఆఫీస్ ఖర్చుల' పేరుతో రూ.5 వేలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు మరింత తీవ్రమైన అంశంగా మారాయి. 'డబ్బులు ఇస్తే పని.. లేకుంటే ఫైల్ ఆలస్యం' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆడియోల నిజానిజాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ.. అవి వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు కనీసం విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.




**ఫిర్యాదులు చేసినా ఎందుకు చర్యలు లేవు?**

వసూళ్ల ఆరోపణలపై బాధితులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. 'అలా చేయడు.. విషయం మాట్లాడతాను' అంటూ చెప్పడం మినహా ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు వస్తే విచారణ చేయాలి.. తప్పు ఉంటే చర్యలు తీసుకోవాలి.. ఆరోపణలు నిరాధారమైతే అది కూడా స్పష్టం చేయాలి. కానీ ఏమీ జరగనట్లు వ్యవహరిస్తే అనుమానాలు మరింత బలపడతాయని ప్రజలు అంటున్నారు.

**'అంతా నా ఇష్టం' అంటే ప్రజాస్వామ్య పాలన ఎక్కడ?.**

అధికారులను ప్రశ్నించిన కొందరితో దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. 'మండలాన్ని సెట్ చేయడానికి వచ్చాను.. అంతా నా ఇష్టం' అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం ఎవరి వ్యక్తిగత వ్యవహారం కాదని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని వారు స్పష్టం చేస్తున్నారు. అధికారం అంటే హుకుం కాదు.. బాధ్యత. ప్రజలను భయపెట్టడం కాదు.. వారి సమస్యలను పరిష్కరించడం అధికారుల విధి అని అంటున్నారు.

**జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి.**

చిన్నగూడూరు మండలంలో ఇసుక రవాణా, ట్రాక్టర్ల పట్టివేత, కొన్ని వాహనాల విడుదల, రూ.5 వేల వసూళ్ల ఆరోపణలు, వైరల్ ఆడియోల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకోవాలి. ఎవరు అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినా వదిలిపెట్టకూడదు. సామాన్యుడికి ఒక న్యాయం, పలుకుబడి ఉన్నవారికి మరో న్యాయం అనే పరిస్థితి ఉంటే దాన్ని తక్షణమే అరికట్టాలి. రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులు, ట్రాక్టర్ల పట్టివేత వివరాలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు, విడుదల ఉత్తర్వులు, సంబంధిత ఆడియోలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే అధికారులపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాలి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు పూర్తి వివరణ ఇవ్వాల్సి ఉంది. అప్పటివరకు 'పట్టుకుంటారు.. వదిలేస్తారు..' అన్న ఆరోపణలకు తెరపడే పరిస్థితి కనిపించడం లేదని మండల ప్రజలు అంటున్నారు.



## అనుపమ పరమేశ్వరన్ బ్రేకప్ స్టోరీలో ట్విస్ట్..

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఓ ప్రముఖ యువ హీరోతో ఆమె ప్రేమలో ఉందని, ఆ తర్వాత ఇద్దరి మధ్య బ్రేకప్ జరిగిందంటూ రకరకాల కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఇప్పటివరకు ఈ వార్తలపై అనుపమ పెద్దగా స్పందించలేదు. తాజాగా ఆమె తన గత రిలేషన్‌షిప్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అనుపమ తన గత ప్రేమ గురించి మాట్లాడుతూ.. తాను ఒక సమయంలో 'టాక్సిక్ రిలేషన్‌షిప్'లో ఉన్నానని వెల్లడించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ బంధంలో తనకు ఎదురైన అనుభవాలు తనను ఎంతో బాధించాయని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తన మాజీ ప్రియుడు మొదట్లో ఒక వ్యక్తిలా కనిపించినప్పటికీ, ఆ తర్వాత పూర్తిగా మరో వ్యక్తిలా తన అసలు స్వభావాన్ని చూపించాడని అనుపమ పేర్కొన్నట్లు సమాచారం.అనుపమ చేసిన వ్యాఖ్యల్లో మరో ఆసక్తికరమైన విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తన ఎక్స్ లవర్ తన కెరీర్ విషయంలో కూడా ఆంక్షలు విధించేవాడని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. సినిమాల ప్రమోషన్స్‌కు వెళ్లడం విషయంలో కూడా తనను నియంత్రించేవాడని, తన వృత్తిపరమైన విషయాల్లో జోక్యం చేసుకునేవాడని అనుపమ వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది.హీరోయిన్‌గా వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం తనకు చాలా ఇబ్బందికరంగా అనిపించిందని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. ఒక రిలేషన్‌షిప్‌లో ప్రేమతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా ముఖ్యమని ఆమె అభిప్రాయపడినట్లు సమాచారం. ఇక అనుపమ వెల్లడించిన మరో విషయం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రిలేషన్‌షిప్ మొదలైన కేవలం మూడు నెలల్లోనే పెళ్లి గురించి ఇరు కుటుంబాల్లో చర్చలు కూడా జరిగిపోయాయని ఆమె చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఆ బంధం ఎంత సీరియస్‌గా కొనసాగిందనే దానిపై ఆసక్తి పెరిగింది.అయితే ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయని, తాను ఊహించిన వ్యక్తి తన ఎక్స్ కాదని అర్థమైందని అనుపమ చెప్పినట్లు సమాచారం. చివరకు ఆ రిలేషన్‌షిప్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని ఆమె వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. అనుపమ తన ఎక్స్ లవర్ పేరును మాత్రం ఎక్కడా ప్రస్తావించలేదని తెలుస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.